ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
గుంటూరు జిల్లా వార్తలు
5
బుధవారం 24 సెప్టెంబరు 2025



సభా ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్

శబరి.. బుకింగ్

హాట్‌కేక్‌ల్లా టిక్కెట్‌లు



- నవంబరు 22వ తేదీ వరకు బుకింగ్ క్లోజ్
- ఉదయం 8 గంటలకు టిక్కెట్ కౌంటర్ల వద్ద ఉన్నా ఫలితం శూన్యం
- ఆన్‌లైన్‌లోనూ కన్‌ఫర్మ్ కాని పరిస్థితి

గుంటూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శబరి ఎక్స్‌ప్రెస్‌లో అన్ని తరగతుల టిక్కెట్‌లు హాట్ కేక్‌లు మాదిరిగా బుకింగ్ అయిపోతున్నాయి. రైల్వే శాఖ అడ్వాన్స్ రిజర్వేషన్ పీరియడ్ (ఏ ఆర్‌పీ)ని 60 రోజులకు తగ్గించడంతో నవంబరు నెల 22వ తేదీ వరకు ఓపెన్ చేసిన అన్నీ తేదీలలో టిక్కెట్‌లు బుకింగ్ అయిపోయాయి. స్లీపర్ క్లాస్ మొదలుకొని ఫస్టు ఏసీ వరకు కూడా టిక్కెట్‌లు అందుబాటు లేవు. కనీసం వెయిటింగ్ లిస్టులోనైనా బుకింగ్ చేసుకోలేని విధంగా రిగ్రెట్ మెసేజ్ వచ్చేస్తోన్నది. టిక్కెట్ల కోసం చాలా మంది తెల్లవారు జామునే సమీపంలోని బుకింగ్ కౌంటర్ల వద్దకు వెళ్లి నిరీక్షిస్తున్నారు. ఆధార్ ప్రామాణీకరణ కలిగిన ఐఆర్‌సీటీసీ యూజర్లు మొబైల్ ఫోన్లు/కంప్యూటర్ల ముందు లాగిన్ అయి కూర్చుంటున్నా టిక్కెట్ బుకింగ్ కావడం లేదు. దీంతో శబరిమలకు ఎలా వెళ్లాలోనని మథన పడుతున్నారు. ఇక భారం అంతా స్పెషల్ ట్రైన్‌ల పైనే వేసి అయ్యప్ప మాలధారణల కు సిద్ధమౌతున్నారు.

ఏటా అక్టోబరు నెల నుంచి ఎక్కువ మంది అయ్యప్ప భక్తులు మాలధారణ చేస్తుంటారు. వీలుని బట్టి 45 రోజుల నుంచి 60 రోజుల పాటు దీక్ష (మిగతా 6వ పేజీలో)

ఆస్తిపన్నుపై.. కసరత్తు

20 శాతం ఆదాయం పెంపే లక్ష్యం

- పట్టణాల్లో రెండో విడత ఇంటింటి సర్వే
- మున్సిపాల్టీల్లో చేజారిన ఆదాయాలపై దృష్టి
- పన్నుపోటు లేకుండా ఆదాయం పెంపునకు లక్ష్యాలు

రూ.52 కోట్లు పెరగాలి..

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని పురపాలక సంఘాల్లో ఆస్తి పన్ను ద్వారా వార్షిక ఆదాయం ప్రస్తుతం రూ.258.95 కోట్లుగా ఉంది. ఈ మొత్తంపై 20 శాతం పెంచుకోవాలని ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించింది. ఈ ప్రకారం మున్సి పాల్టీల్లో ఆదాయం సుమారు రూ.52 కోట్లు పెరుగుతుందని అంచనా.

- గుంటూరు జిల్లాలో గుంటూరు కార్పొరేషన్ సహా జిల్లా పరిధిలోని మున్సిపాల్టీలలో ఆస్తి పన్ను వార్షిక ఆదాయం రూ.185.31 కోట్లు ఉంది. 20 శాతం పెరగాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ మేరకు 37.06 కోట్లు ఆదాయం పెరిగే అవకాశం ఉంది.
- పల్నాడు జిల్లాలో ఆస్తి పన్ను ఆదాయం రూ 47.01 కోట్లు. రూ.9.40 కోట్లు పెరగాల్సి ఉంది.
- బాపట్ల జిల్లాలో ఆస్తి పన్ను 26.63 కోట్లు ఉండగా రూ.5.32 కోట్లు ఆదాయం పెరగాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది.

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

మున్సిపాల్టీల్లో పన్ను పెంచకుండా ఆదాయ వనరులను పొందేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రస్తుతం ఉన్న ఆస్తి పన్నుల ఆదాయం మరో 20 శాతం పెరగాలని లక్ష్యం నిర్దేశించింది. ప్రభుత్వ ఆదేశాలతో ఆదాయం పెంచుకునేందుకు ఉన్న మార్గాలపై పురపాలకులు దృష్టి సారించారు. ఈ క్రమంలో చేజారిన పన్నులను తిరిగి రాబట్టుకునేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఆస్తి పన్నుల ఆదాయాన్ని పెంచుకునేందుకు సర్వే చేస్తున్నారు. తొలివిడత సర్వే సక్రమంగా జరగలేదని భావించిన డీఎంఏ మరో సారి ఆస్తి పన్ను సర్వేకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో రెండో సారి ఆస్తి పన్ను పునః పరిశీలనకు ఇంటింటి సర్వే చేస్తున్నారు. ఈ సర్వేను వచ్చే 15 కల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఎక్కడికక్కడ మున్సిపాల్టీల్లోని సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు మున్సిపల్ రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో సర్వే చేస్తున్నారు. సర్వే జరుగుతున్న తీరుపై డీఎంఏ వారంతపు సమీక్షలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ అధికారులు చెబుతున్నారు.

అక్రమాలకు చెక్ పడేనా..

మున్సిపాల్టీలకు ప్రధాన ఆదాయ వనరు ఆస్తి పన్ను. ఈ పన్ను మదింపులో గతంలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. పన్నులకు సంబంధించి గత టీడీపీ ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. భవనం.. ఖాళీ (మిగతా 6వ పేజీలో)



డీఎస్సీ సభకు ఏర్పాట్లు

- వెలగపూడిలో 25న నియామక పత్రాల పంపిణీ
- ఏర్పాట్లలో లోపం ఉండకూడదన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

తుళ్లూరు(వెలగపూడి), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఎంపికైన వారికి ఈ నెల 25న నియామకపత్రాల పంపిణీ సభకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాజధాని అమరావతి పరిధిలోని వెలగపూడి రాష్ట్ర సచివాలయం వద్ద ఎన్- 9 రోడ్డు పక్కన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డీఎస్సీ అభ్యర్థులకు నియామకపత్రాలు అందజేయనున్నారు. వర్షాల నేపథ్యంలో 19న జరగాల్సిన కార్యక్రమం వాయిదా పడింది. అయితే 25న నిర్వహణకు అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మూడు భారీ జర్మన్ వాటర్ ప్రూఫ్ టెంట్లను ఏర్పాటు చేశారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు, గుంటూరు కలెక్టర్ తమీమ్‌అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్ ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా రాకపోకల మార్గాలు, స్టేజి, బారీకేడింగ్ పనులతో పాటు సీటింగ్ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. భద్రత, బందోబస్తు ఏర్పాట్ల గురించి చర్చించారు. ఎల్ఈడీ స్ర్కీన్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ సెక్రటరి కోన శశిధర్, డైరెక్టర్ విజయ్ రామరాజు, ఇంటెలిజెన్స్ ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు.

రిటైనింగ్‌వాల్‌కు.. టెండర్లు



- దిగువ కృష్ణానది కుడివైపు మహానాడు ఏరియాలో రక్షణ గోడ ఏర్పాటు కానున్న ప్రాంతం

8లో..

- రూ.245 కోట్లతో కుడికట్ట పనులు
- దిగువ కృష్ణలో 1.71 కిమీ పొడవునా రక్షణ గోడ
- మంత్రి లోకేశ్ కృషితో తీరనున్న పేదల కడగండ్లు

ముగ్గురికి కలరా

జీజీహెచ్‌లో 92 అతిసార కేసులు

- సమస్యాత్మక ప్రాంతాల్లో ఇంటింటి సర్వే
- డయేరియా ప్రాంతాల్లో కలెక్టర్ విస్తృత పర్యటన
- ప్రభావిత ప్రాంతాల్లో పానీపూరి విక్రయాలపై నిషేధం



ప్రగతి నగర్‌లో పర్యటిస్తున్న కలెక్టర్, కమిషనర్, ఎమ్మెల్యే

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వీడని వర్షాలు.. తాగునీరు కలుషితం తదితర కారణాలతో గత కొన్ని రోజులుగా గుంటూరు నగరంలో అతిసార ప్రబలుతోంది. ఈ క్రమంలో గుంటూరులో



జీజీహెచ్ వరండాలో చికిత్స పొందుతున్న బాధితులు

ముగ్గురికి కలరా సోకినట్లు అధికారులు గుర్తించారు. నగరపాలక సంస్థ పరిధిలో ఇప్పటి వరకు ప్రగతి నగర్‌లో రెండు, రామిరెడ్డినగర్‌లో ఒకటి కలరా కేసులు నమోదైనట్లు మంగళవారం కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. పాతగుంటూరు ప్రాంతంలోని ప్రగతినగర్, సుద్దపల్లిడొంక, యాదవ్‌బజార్, బాలాజీ నగర్, రామిరెడ్డినగర్, సీతానగర్, నెహ్రూనగర్, ఆర్టీసీ కాలనీలో ఎక్కువగా డయేరియా కేసులు నమోదు అవుతున్నాయి. ఆయా ప్రాంతాలను సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించారు. ప్రస్తుతం జీజీహెచ్‌లో 92 మంది డయేరియా లక్షణాలతో చికిత్స పొందు తున్నారు. వీరి ఆరోగ్యం స్థిరంగా ఉందని కలెక్టర్ ప్రకటించారు. డయేరియాకు కారణాలను ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలు, వైద్యనిపుణుల విశ్లేషిస్తున్నారన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో 50 సర్వేలెన్స్ టీంలతో ఇంటింటి సర్వే చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సమ స్యాత్మక ప్రాంతానికి జిల్లా అధికారిని స్పెషల్ ఆఫీసర్‌గా నియమించినట్లు చెప్పారు. బయట ఆహారం, పానీపూరీలు తినడం వల్ల అనారోగ్యానికి గురైనట్లు బాధితులు చెప్పారని, సాధారణ పరిస్థితులు వచ్చే వరకు పానీ పూరి అమ్మకాలు నిలిపివేస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు.

పరామర్శలు.. పర్యటనలు..

కాగా కలెక్టర్ అన్సారియా జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులను పరామర్శించారు. అనంతరం నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అహ్మద్‌తో కలసి నగరపాలక సంస్థ పరిధిలో డయేరియా ప్రబలిన ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటించారు. ప్రగతినగర్‌లో సర్వేలెన్స్ టీంలను తక్షణమే నియమించాలని డీఎంహెచ్‌వో విజయలక్ష్మిని ఆదేశించారు. ప్రతి ఇంటికి క్లోరిన్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. రామిరెడ్డితోటలో మున్సిపల్ పాఠశాలలో నిర్వహిస్తున్న వైద్యశిబిరాన్ని కలెక్టర్ పరిశీలించారు. రామిరెడ్డితోటలో మొబైల్ వ్యాన్‌లోని పరీక్షా కేంద్రంలో వాటర్ టెస్టింగ్‌ను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం నెహ్రూనగర్‌లోని రిజర్వాయర్లలో తాగునీటిలో క్లోరిన్ శాతం పరీక్షలను పరిశీలించారు. నగరపాలక సంస్థ సరఫరా చేస్తున్న తాగునీటిని నిరంతరం శాంపిల్స్ తీసి క్లోరిన్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు నీటిని మరగకాచి చల్లార్చి తాగాలని కోరారు.

దీక్షతో.. పాఠం

- చదివి వినేలా యాప్ రూపకల్పన
- పుస్తకాలపై క్యూఆర్ కోడ్ స్కాన్‌తో అవకాశం

8లో..

శీతల గిడ్డంగుల్లో ఇంకా 60 లక్షల మిర్చి టిక్కీలు

- ఏఎంసీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక

హోరాహోరీగా 62వ జాతీయ చెస్ చాంపియన్‌షిప్

6లో..

ఆ పదవుల భర్తీ ఎప్పటికో?

- దసరాకైనా మోక్షం లభించేనా
- ఏడాదికి పైగా గుంటూరు యార్డు చైర్మన్ ఖాళీ
- టీడీపీ జిల్లా అధ్యక్ష స్థానంపై కొనసాగుతున్న కసరత్తు



గుంటూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కీలకమైన రెండు పదవులకు దసరా పర్వదినానికైనా మోక్షం లభిస్తుందేమోనని రాజకీయ నేతలు ఆశగా ఎదురుచూస్తోన్నారు. ఏడాదిపైగా మిర్చియార్డు చైర్మన్ పీఠం ఖాళీగా ఉంది. మరో వైపు టీడీపీ జిల్లా అధ్యక్ష పదవికి కూడా కొత్త సారథి కోసం అన్వేషణ జరుగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి యార్డు చైర్మన్ పదవిని ఎవరికి కట్టబెట్టాలనే విషయంలో ఏకాభిప్రాయానికి రాలేకపోతున్నారు. గుంటూరు మిర్చియార్డు చైర్మన్ పదవి అంటే నామినేటెడ్ పదవుల్లో కెల్లా పెద్ద పదవిగా భావిస్తారు. యార్డులో ఏడాదికి రూ.వెయ్యి కోట్లకు పైగా లావాదేవీలతో రూ.100 కోట్లకు పైగా ఆదాయం వస్తుంది. ఇంతటి ప్రతిష్ఠాత్మకమైన చైర్మన్ పీఠాన్ని దక్కించుకునేందుకు పలువురు నేతలు ఇప్పటికీ తమ తమ ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ పదవిపై స్పష్టత రాకపోవడంతో టీడీపీ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. మరో వంక ఈ పదవిపై జనసేన నేతలు కూడా ఆశలు పెట్టుకుని ముఖ్య నేతలను కలిసి తమ కోరికను విన్నవించుకుంటున్నారు. మొదట బీసీలకు ఇవ్వాలనే ఆలోచన చేయగా పరిశీలనలోకి వచ్చిన ఒకరిద్దరి నేతల పేర్లపై వ్యతిరేకత వ్యక్తమవడంతో ఆ ఆలోచనను విరమించుకున్నట్లు సమాచారం. ఇక జిల్లా అధ్యక్ష సారథి ఎంపికకు ఇటీవల త్రీమెన్ కమిటీ అభిప్రాయ సేకరణ నిర్వహించింది. ఈ పదవిని సామాజిక సమతుల్యతలో భాగంగా బీసీలకే ఇవ్వాలని అధిష్ఠానం ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం జిల్లా అధ్యక్షుడుగా ఉన్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ ఎస్సీ కావడంతో ఆయన్ని తప్పించి ఓసీలకు ఇవ్వడం సమంజసం కాదని అధిష్ఠానం స్పష్టంగా చెప్పినట్లు సమాచారం.

మరమ్మతులు మరిచారు

- నిర్వహణను పట్టించుకోని నిర్వాహకులు
- ప్రిన్సిపాళ్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని గుత్తేదారు
- సురక్షిత తాగునీరు అందక విద్యార్థులు అవస్థలు



ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పనిచేయని ఆర్వో ప్లాంట్

కళాశాలల్లో అటకెక్కిన ఆర్వో ప్లాంట్లు

గుంటూరు(విద్య), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కళాశాలల్లో విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందించేందుకు రూ.లక్షలతో ఆర్వో ప్లాంట్లు నిర్మించారు. అయితే నిర్వహణను పట్టించుకోకపోవడంతో ఆర్వో ప్లాంట్లు మూణ్నాళ్ల ముచ్చటగా మారాయి. మరమ్మతులు గురించి నిర్వహణ సంస్థ పట్టించుకోక పోవడంతో పలు కళాశాల్లో ఆర్వో ప్లాంట్లు నిరుపయోగంగా మారాయి. మరమ్మతుల గురించి గుత్తేదారు పట్టించుకోక పోవడంతో విద్యార్థులకు పరిశుభ్రమైన నీరు అందించడం కాగితాలకే పరిమితమైంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రభుత్వం జూనియర్ కళాశాలలు 21 పైగా ఉండగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు నేడు పేరుతో ఒక్కో ఆర్వో ప్లాంట్లను రూ.3 లక్షలకుపైగా వ్యయం చేసి నిర్మించారు. పదివేల లీటర్లకు పైగా పరిశుభ్రమైన తాగునీరు అందించేలా వీటిని ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్లను ఐదేళ్ల పాటు గుత్తేదారు సంస్థ నిర్వహించాలి. అయితే ప్లాంట్లు ఏర్పాటు చేసి రెండున్నరేళ్లు కూడా కాలేదు. అయినా అనేక కళాశాలల్లో ఆర్వో ప్లాంట్లు పని చేయడం లేదు. కొన్నిచోట్ల వైరింగ్, ప్లంబింగ్ సమస్యలతో పాటు సాంకేతిక సమస్యలతో ప్లాంట్లు అటకెక్కాయి. సకాలంలో మరమ్మతు లు చేయాల్సిన కాంట్రాక్టు సంస్థ పట్టించు కోవడంలేదని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆయా సమస్యలపై ప్రిన్సిపాళ్లు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నా గుత్తేదారు పట్టించుకోవడం లేదు. ఫలితంగా ప్లాంటు ఉన్నా పరిశుభ్రమైన తాగునీరు అందక విద్యా ర్థులు ఇబ్బందులు పడుతున్నారు. గుంటూరులోని వృత్తి విద్య జూనియర్ కళాశాల, బాలి కల జూనియర్ కళాశాలలో ప్లాంట్లు మూడు నెలల నుంచి పనిచేయడం లేదు. ఇటీవల కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కళాశాలకు వచ్చిన సమయంలో కూడా ప్లాంట్ల పరిస్థితి గురించి విద్యార్థులు, అధ్యాపకులు ఫిర్యాదులు చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా అనేక కళాశాలలో ఆర్వో ప్లాంట్లు పరిస్థితి ఇదే విధంగా ఉందని ఫిర్యాదులు వస్తున్నాయి. ప్లాంట్ల మరమ్మతుల గురించి ఉన్నతస్థాయిలో అధికారులు స్పందిం చాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.



ట్యాప్ ల వద్ద అపరిశుభ్ర వాతావరణం

మూడో ట్రాక్‌పై తనిఖీలు

నేడు, రేపు 160 కిమీ వేగంతో స్పీడ్ టెస్టు

- పరిశీలించి క్లియరెన్స్ ఇవ్వనున్న సీఆర్ఎస్ బృందం
- చుండూరు-పెదవడ్లపూడి సెక్షన్‌లో ఇన్‌స్పెక్షన్
- అప్పికట్ల - నిడుబ్రోలు మధ్య శాశ్వత డైవర్షన్ పనుల పరిశీలన

గుంటూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): చుండూరు - పెదవడ్లపూడి సెక్షన్‌లో రైల్వే శాఖ పూర్తి చేసిన మూడో రైలుమార్గాన్ని కమిషన్ ఆఫ్ రైల్వే సేఫ్టీ(సీఆర్ఎస్) బుధ, గురువారంలో తనిఖీ చేయ నున్నది. దాదాపు 160 కిలోమీటర్ల వేగంతో స్పీడ్‌టెస్టు కూడా చేయనున్నది. మోటార్ ట్రాలీ ఇన్‌స్పెక్షన్ ద్వారా సీఆర్ఎస్ అధికారులు పర్యవేక్షించనున్నారు. ఇందుకోసం రెండు రోజుల షెడ్యూల్‌ని దక్షిణ మధ్య రైల్వే హెడ్‌క్వార్టర్స్ సంబంధిత రైల్వే అధికారులకు పంపించింది. ఇన్‌స్పెక్షన్‌కు ఎలాంటి అవరోధాలు తలెత్తకుండా చూసుకోవాలని విజయవాడ డీఆర్ఎంని ఆదేశించారు. దీంతో పాటుగా అప్పికట్ల - నిడుబ్రోలు మధ్య శాశ్వత డైవర్షన్ పనులను కూడా సీఆర్ఎస్ ఇన్‌స్పెక్షన్ చేసి క్లియరెన్స్ ఇస్తారు. ఇందుకోసం సీఆర్ఎస్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రానుంది. సీఆర్ఎస్‌తో పాటు సిబ్బంది, ఆర్‌వీఎన్ ఎల్ అధికారులు కూడా రానున్నారు. ఈ ఇన్‌స్పెక్షన్ కోసం ఐదు మోటార్ ట్రాలీలను వినియోగిస్తారు. ఈ ట్రాలీలను అప్పికట్ల, చుండూరులో అందుబాటులో ఉంచాల్సిందిగా హెడ్‌క్వార్టర్స్ నుంచి ఆదేశాలు జారీ చేశారు.

30 కిలోమీటర్ల ట్రాక్ సిద్ధం..

విజయవాడ-గూడూరు మధ్య మూడో రైలు నిర్మాణంలో భాగంగా బాపట్ల, గుంటూరు జిల్లా పరిధిలో చుండూరు - పెదవడ్లపూడి మధ్య 30 కిలోమీటర్ల సెక్షన్‌ని రైల్వే శాఖ నిర్మించింది. ఇటీవలే 100కు పైగా రైళ్లను బ్రేక్‌డౌన్ చేసి ప్రీఎన్ఐ, ఎన్ఐ వర్కులను కూడా పూర్తి చేసింది. దీంతో రైళ్లను నడిపేందుకు అవసరమైన క్లియరెన్స్‌ని ఇచ్చేందుకు సీఆర్ఎస్ బుధవారం ఉదయం విజయవాడకు చేరుకుంటున్నది. విజయవాడ డివిజన్ డీఆర్ఎంతో కలిసి ఉదయం 9 గంటలకు మోటారు ట్రాలీ ఇన్‌స్పెక్షన్‌ని అప్పికట్ల నుంచి చేపడతారు. ఇక్కడి నుంచి చుండూరు వరకు మోటార్ ట్రాలీని సాధా రణ వేగంతోనే నడిపి పరిశీలిస్తారు. మధ్యాహ్నం 12.30 గంటల లోపు చుండూరు - తెనాలి మధ్య లైట్‌రన్ నిర్వహిస్తారు. భోజన విరామం అనంతరం తెనాలి నుంచి దుగ్గిరాల వరకు ఇన్‌స్పెక్షన్, లైట్ రన్ చేపడతారు. ఈ నెల 25న గురువారం ఉదయం దుగ్గిరాల నుంచి పెదవడ్లపూడి వరకు ఇన్ స్పెక్షన్ జరుగుతుంది. ఆ తర్వాత పెదవడ్లపూడి నుంచి చుండూరు/అప్పికట్ల వరకు స్పీడ్ టెస్టు నిర్వహించనున్నారు.

హోరాహోరీగా జాతీయ చెస్ చాంపియన్‌షిప్



చెస్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

గుంటూరు (విద్య) సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గుంటూరు సమీపంలోని వడ్లమూడి విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో 62వ జాతీయ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. ఈ పోటీలను ఆంధ్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శి కే జగదీష్ పర్యవేక్షిస్తున్నారు. ఈ పోటీలను ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆంధ్ర చెస్ అసోసియేషన్ నిర్వహిస్తోంది. చిన్న చిన్న సంచలనాలు మినహా, ఎక్కువ మంది అగ్ర క్రీడాకారులు మూడో రౌండ్‌లోకి సులభంగా అడుగుపెట్టారు. ఆంధ్రప్రదేశ్ క్రీడాకారుడు లలిత్ బాబు, తమిళనాడుకు చెందిన అయుష్ రవికుమార్‌పై గెలుపొంది మూడో రౌండ్‌కు చేరుకున్నాడు. వీరి మధ్య పోటీ ఆసక్తికరంగా జరిగింది.

26న జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు

గుంటూరు (విద్య) సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వారధి ఇండియా ఫౌండేషన్ స్థానిక పాత బస్టాండ్ వద్ద ఉన్న పరీక్షా భవన్లో ఈ నెల 26న జిల్లాస్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ సీవీ రేణుక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు పోటీలు జరుగుతాయని వెల్లడించారు. ప్రధానోపాధ్యాయులు, మండల స్థాయి విజేతలను గైడ్ టీచర్ల సహాయంతో జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు పంపాలని సూచించారు. జిల్లాస్థాయి విజేతలు రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఇతర వివరాల కోసం జిల్లా సైన్స్ అధికారి షేక్ గౌసుల్ మీరా (7842869407), అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ రమ్య (98665 53230) తదితరులను సంప్రదించాలని సూచించారు.


శీతల గిడ్డంగుల్లో ఇంకా 60 లక్షల మిర్చి టిక్కీలు

● దసరా తర్వాత అమ్మకాలు, ధర పెరిగే అవకాశాలు
● ఏఎంసీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక

గుంటూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరం చుట్టుపక్కల ఉన్న శీతల గిడ్డంగుల్లో ఇంకా 60 లక్షల మిర్చి టిక్కీలు నిల్వవున్నట్లు తాము వివరాలు సేకరించామని గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఆంధ్రజ్యోతి సంచికలో మంగళవారం 'గుంటూరు మిర్చిపై దసరా ఎఫెక్ట్' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి సెక్రెటరీ స్పందించారు. ప్రస్తుతం విపరీతమైన వర్షాలు కురుస్తుండటం, మిర్చిలో తేమ శాతం పెరగడం, రవాణా ఇబ్బందుల వలన బంగ్లాదేశ్‌కు ఎగుమతులు తగ్గాయన్నారు. ఈ ప్రభావం మిర్చి అమ్మకాలపై ఉందన్నారు. పండగ సెలవుల అనంతరం అమ్మకాలు, ధరలు పెరగొచ్చని ఎగుమతి, దిగుమతి వ్యాపారస్థులు తెలిపారని పేర్కొన్నారు. ఏటా దసరా నవరాత్రుల సందర్భంలో ఈ పరిస్థితి తలెత్తుందన్నారు.

ప్రకాశం బ్యారేజి వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక

● దిగువకు 3 లక్షల 97 వేల 250 క్యూసెక్కులు ● డెల్టా కాలువలకు 13 వేల 769 క్యూసెక్కులు



ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరద నీరు

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి భారీగా పెరిగింది. ఎగువన వున్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు బ్యారేజి ఎగువన ఉన్న మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుండి 4 లక్షల 11 వేల 019 క్యూసెక్కుల వరద నీరు ప్రకాశం బ్యారేజి రిజర్వాయర్‌కు చేరుకుంది వరద ఉధృతి 4 లక్షల క్యూసెక్కులు దాటడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా మొత్తం 70 గేట్లను ఎత్తి దిగువకు 3 లక్షల 97 వేల 250 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు జేఈ రాజేష్ తెలిపారు. అలాగే తూర్పు డెల్టా కాలువకు 8242 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 5527 క్యూసెక్కులు వదులు తుండగా, గుంటూరు ఛానల్ కాలువకు నీటి విడుదల నిలిపివేశారు. ప్రకాశం బ్యారేజికి వరద ఉధృతి భారీగా పెరుగుతుండడంతో దిగువ నదీతీర ప్రాంతాల వాసులు, లంకభూముల రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

పులిచింతల సమాచారం

పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 37.50 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా 16,600 క్యూసెక్కులు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కులు, 12 గేట్లను నాలుగు మీటర్ల మేర ఎత్తి 3,551,168 క్యూసెక్కుల నీరు, మొత్తం 3,68,168 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

పశ్చిమడెల్టాకు 5527 క్యూసెక్కులనీరు

దుగ్గిరాల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమడెల్టాకు 5527 క్యూసెక్కునీరు మంగళవారం విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా దిగువకు 4,11,019 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లెకాల్వకు 1513 క్యూసె క్కులనీరు, తూర్పుకాల్వకు 415 క్యూసెక్కులనీరు పశ్చిమకాల్వకు 237 క్యూసెక్కులనీరు, నిజాంపట్నంకాల్వకు 423 క్యూసెక్కులనీరు, కొమ్మ మూరుకాల్వకు 2140 క్యూసెక్కులనీరు, విడుదల చేస్తున్నారు.

విద్యుదుత్పత్తి నిలిపి వేత

రెంటచింతల,సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సత్రశాలలోని కృష్ణా నదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి పులిచింతలకు 3,26,146 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కే వెంకటరమణ, ఈఈ సుబ్రహ్మణ్యం, గిరిబాబులు చెప్పారు. ప్రాజెక్టుకు వున్న 20 గేట్లకు 14 క్రస్ట్ గేట్లను 4 మీటర్లు, 2 గేట్లను 3.5 మీర ఎత్తామన్నారు.ఎగువన వున్న సాగర్ నుంచి 3,26,838 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌కు వస్తుందన్నారు.ప్రస్తుతం రిజర్వాయర్‌లో 74.63 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 6.4880 టీఎంసీలకు సమానమన్నారు.

దిగువకు 3,97,250 క్యూసెక్కుల వరద నీరు విడుదల

మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

కొల్లూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు 3,97,250 క్యూసెక్కుల వరద నీరు విడుదల చేశారు. మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు 3.84 లక్షల క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేయగా ఎగువ నుంచి వరద ఉధృతి ఎక్కువ కావడంతో ఆరున్నర సమయంలో 3,97,250 క్యూసెక్కులు దిగువకు విడుదల చేయడంతో పాటు తూర్పు, పశ్చిమ ప్రధాన కాల్వలకు కూడా మరో 13,769 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. వరద మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. 5.67 లక్షల క్యూసెక్కుల వరద నీరుకు మించితే రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల్లో నదీ పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక అధికారులు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశారు.



దోనేపూడి వద్ద చప్టాపై పారుతున్న వరద నీరు

ఏఎన్‌యూలో స్మార్ట్ ఇండియా అంతర్గత హ్యాకథాన్

ఏఎన్‌యూ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం "స్మార్ట్ ఇండియా అంతర్గత హ్యాకథాన్ 2025"ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గంగాధర రావు మాట్లాడుతూ యువత తమలోని ప్రతిభను, పారిశ్రామిక ఆలోచనలను ప్రదర్శించేందుకు ఈ వేదిక ఎంతో తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వీరయ్య, సమన్వయకర్త సూర్యకామేశ్వరి, ప్యానల్ సభ్యులు డాక్టర్ కె.లావణ్య, డాక్టర్ జి.నీలిమతో పాటు అతిథి అధ్యాపకులు పాల్గొన్నారు.



హ్యాకథాన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ గంగాధరరావు

ఏపీ పీజీసెట్‌లో 9,892 సీట్లు భర్తీ

2025-26 విద్యా సంవత్సరానికిగానూ మొదటి కౌన్సెలింగ్‌లో భాగంగా అభ్యర్థులకు పీజీ ప్రవేశాలు (ఏపీ పీజీసెట్-2025) కేటాయించినట్లు వీసీ ప్రవేశాల కన్వీనర్ ఆచార్య రవికుమార్ మంగళవారం తెలిపారు. పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు 11,401 మంది అభ్యర్థులు పేర్లు నమోదు చేసుకున్నారని చెప్పారు. వెబ్ ఆప్షన్ అనంతరం 9,892 మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించామని తెలిపారు. ప్రవేశాలు పొందిన అభ్యర్థులు ఈ నెల 27లోపు వారికి కేటాయించిన కళాశాలల్లో రిపోర్టు చేయాలని సూచించారు. ప్రవేశాల ప్రక్రియ ర్యాంకులు ఆధారంగా పారదర్శకంగా జరిగిందని ఆయన తెలిపారు. ప్రత్యేక క్యాటగిరీల ప్రవేశాలు, మొదటి దశ కౌన్సిలింగ్ అనంతరం మిగిలిన సీట్ల భర్తీకి రెండోదఫా కౌన్సెలింగ్‌ను త్వరలో నిర్వహిస్తామని కన్వీనర్ ఆచార్య రవికుమార్ పేర్కొన్నారు.

ఉపాధ్యాయుడు ఝున్నుసాహెబ్‌కు నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డు



యడ్లపాడు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అందమైన చేతిరాతకు ప్రాణం పోస్తూ.. వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న ఉపాధ్యాయుడు ఝున్నుసాహెబ్‌కు అరుదైన గౌరవం లభించింది. ఒకే నెలలో మూడు అవార్డులను కైవసం చేసుకుని జిల్లాలోనే హ్యాట్రిక్ అవార్డు గ్రహీతగా నిలిచారు. మండలంలోని కొండవీడు పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న ఝున్నుసాహెబ్ విద్యార్థులలో చేతిరాత నైపుణ్యాలను పెంపొందించడంలో విశేష కృషిచేస్తున్నారు. కేవలం తమ పాఠశాలకే పరిమితం కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా అందంగా రాయడం(కాలిగ్రఫీ)లో శిక్షణ ఇస్తూ తన సేవాభావాన్ని చాటుకుంటున్నారు. ప్రతిసారీ ఆయా పాఠశాలలకు వెళ్ళి శిక్షణ ఇవ్వడం సాధ్యం కానందున విద్యార్థులతో పాటు అక్కడి ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అనేక పాఠశాలలకు సెలవుదినాల్లో వెళ్లి ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. ఆయన అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ నెలలో వరుసగా మూడు అవార్డులు వరించాయి.సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యాశాఖ ఆయనను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో సత్కరించింది. ఈ నెల 7న విశాఖపట్నంకు చెందిన సెయింట్ మదర్‌థెరెస్సా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఏటా అందించే గురుబ్రహ్మ అవార్డును ప్రదానం చేసింది. తాజాగా హైదరాబాద్‌కు చెందిన శారదా ఎడ్యుకేషన్ సొసైటీ ప్రతిష్టాత్మకంగా అందించే నేషనల్ టీచర్స్ ఎక్స్‌లెన్స్-2025 అవార్డుకు ఎంపికయ్యారు. ఈ నెల 25న హైదరాబాద్‌లోని భాస్కర ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో అవార్డును అందుకోనున్నారు. వినూత్న బోధనా పద్ధతులతో విద్యాబోధన, వర్క్‌షాపులు నిర్వహిస్తూ విద్యా సేవలు అందిస్తున్న ఝున్నుసాహెబ్‌కు వరుసగా అవార్డులు లభించడం పట్ల సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు అభినందనలు తెలియజేశారు.

శబరి..బుకింగ్

(5వ పేజీ తరువాయి)

చేసి ఇరుముడులతో అయ్యప్పస్వామిని దర్శించుకొనేందుకు బయలుదేరు తుంటారు. దాదాపుగా ఒక రోజంతా ప్రయాణ సమయం ఉండటంతో ఎక్కువ మంది రైళ్లలోనే వెళ్లేందుకు ప్రాధాన్యం కనబరుస్తుంటారు. అయితే గుంటూరు మీదగా శబరిమలకు వెళ్లే ఒకే ఒక్క రైలు శబరి ఎక్స్‌ప్రెస్. ఇది సికింద్రాబాద్‌లో బయలుదేరి ఉమ్మడి గుంటూరు జిల్లాలో నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుం టూరు, తెనాలి, నిడుబ్రోలు, బాపట్ల మీదుగా ప్రయాణిస్తుంది. ప్రస్తుతం నం బరు. 17230గా ఉన్న సికింద్రాబాద్ - తిరువనంతపురం శబరి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 29వ తేదీ నుంచి నంబరు. 20629 సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్‌గా మారబోతు న్నది. ఈ కారణంగా టైంటేబుల్‌ని కూడా మార్పు చేశారు. 28వ తేదీ వరకు ప్ర స్తుత కాలమానపట్టికలోనే ప్రయాణిస్తుంది. 29వ తేదీ నుంచి మాత్రం సికింద్రా బాద్‌లో మధ్యాహ్నం 2.25కి బయలుదేరి సాయంత్రం 4.59కి నడికుడి, 5.19కి పిడుగురాళ్ల, 5.49కి సత్తెనపల్లి, 6.35కి గుంటూరు, రాత్రి 7.33కి తెనాలి, 7.53కి నిడుబ్రోలు, 8.13కి బాపట్ల, 8.28కి చీరాల, మరునటి రోజు మధ్యాహ్నం 2.12కి కొట్టాయం, 2.55కి చెంగనూరు, సాయంత్రం 6.20కి తిరువనంతపురం చేరుకొంటుంది.

అయ్యప్ప భక్తులు ఇరుముడులు కట్టించుకొని మధ్యాహ్నం భోజనం చేసి కాసేపు విశ్రాంతి తీసుకొని ఈ రైలులో బయలుదేరే విధంగా టైంటేబుల్ ఉండ టంతో ఇందులో ప్రయాణించేందుకు ఆసక్తి చూపుతున్నారు. విజయవాడ మీద గా శబరిమలకు వెళ్లే రైళ్లు ఉన్నప్పటికీ అవి దూర ప్రాంతాల నుంచి వచ్చేవి. ప్రస్తుతం తత్కాల్ కోటా టిక్కెట్‌లు ఎలాగైతే హాట్‌కేక్‌లు మాదిరిగా బుకింగ్ అయిపోతాయో శబరి ఎక్స్‌ప్రెస్‌కి ఏ రోజుకు ఆ రోజు ఉదయం 8 గంటలకు బు కింగ్ ఇలా తెరవగానే అలా అయిపోతున్నాయి. ఈ నేపథ్యంలో రద్దీ రోజులను బట్టి టీవోడీ(ట్రైన్ ఆన్ డిమాండ్)లను శబరిమలకు నడపాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

ఆస్తి పన్నుపై.. కసరత్తు

(5వ పేజీ తరువాయి)

స్థలం కొలతలను ఆన్‌లైన్‌లో పొందుపరిస్తే పన్ను ఎంతో తెలుస్తుంది. ఈ విధానంలో అక్రమాలు జరగవని భావించినా కొన్ని మున్సిపాల్టీల్లో సిబ్బంది చేతివాటం ప్రదర్శించి తప్పుడు కొలతలు నమోదు చేశారు. దీంతో పన్ను తక్కువగా నమోదైందని కూటమి ప్రభుత్వం నిర్ధారించింది. నివాస భవనాన్ని వ్యాపార, వాణిజ్య అవసరాలకు వినియోగించడం, పన్ను విధించిన సమయంలో ఒక అంతస్తు ఉన్న భవనంపై కట్టడాలు కూడా ఉన్నాయి. పైగా గత వైసీపీ ప్రభుత్వంలో అధికార పలుకుబడితో పలువురు పన్నులను తగ్గించుకున్నారు. ఇలాంటి అక్రమాలపై దృష్టి సారించాలని పురపాలకులను డీఎంఏ ఆదేశించింది. దీంతో ఆ లోపాలను గుర్తించేందుకు సర్వే చేస్తున్నారు. అన్ అసైన్డ్.. అండర్ అసైన్డ్ భవనాలను కూడా గుర్తిస్తున్నారు.

తిరుపతి ఎక్స్‌ప్రెస్ తాత్కాలికంగా ధర్మవరం వరకు పొడిగింపు

గుంటూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నిత్యం గుంటూరు - తిరుపతి - గుంటూరు మధ్యన ప్రయాణించే ఎక్స్‌ప్రెస్ రైలుని వచ్చే నెల నుంచి ధర్మవరం వరకు పొడిగిస్తూ రైల్వే శాఖ నిర్ణయించింది. అక్టోబరు 1వ తేదీ నుంచి నంబరు. 17261 గుంటూరు - ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌గా మారుతుంది. ఈ రైలు తిరుపతికి చేరుకొన్న తర్వాత పాకాల, పీలేరు, కలికిరి, మదనపల్లె, ములకలచెరువు, కదిరి మీదగా ఉదయం 9 గంటలకు ధర్మవరం చేరుకొంటుంది. అక్టోబరు 2వ తేదీ నుంచి నంబరు. 17262 ధర్మవరం - గుంటూరు ఎక్స్‌ప్రెస్‌గా మారుతుంది. ఈ రైలు మధ్యాహ్నం 1.20కి బయలుదేరి పైన పేర్కొన్న స్టేషన్ల మీదగా తిరుగు ప్రయాణమై తిరుపతికి రాత్రి 7.15కి చేరుకొని 7.25కి బయలుదేరుతుంది. ప్రస్తుతం వలే మరుసటి రోజు ఉదయం 7.20కి గుంటూరు చేరుతుంది. ఈ మార్పు నవంబరు 30వ తేదీ వరకు అమలులో ఉంటుంది.

ప్రపంచ తెలుగు మహాసభలకు గోవా గవర్నర్‌కు ఆహ్వానం



గోవా గవర్నర్ అశోక్‌గజపతి రాజుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న గజల్ శ్రీనివాస్, రామచంద్రరాజు

గుంటూరు (తూర్పు), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర సారస్వత పరిషత్, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యం లో వచ్చే ఏడాది జనవరి 3వ తేదీ నుంచి మూడు రోజుల పాటు గుంటూరులో జరిగే 3వ ప్రపంచ తెలుగు మహా సభల ఆహ్వాన పత్రికను గోవా గవర్నర్ పూసపాటి అశోక్‌గజపతి రాజుకు పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్, సమన్వయకర్త పీ రామచంద్రరాజులు అందజేశారు. జనవరి 5వ తేదీన ఉదయం 10 గంటలకు మహాసభలలో భాగంగా జరిగే ఆంధ్ర వైభవం సభకు ముఖ్య అతిథిగా విచ్చేసి తెలుగు సాహితీ, సాంస్కృతిక, సేవా రంగ ప్రముఖులకు ఆంధ్ర శ్రీ, ఆంధ్ర సారస్వత భూషణ, ఆంధ్ర సారస్వ త రత్న పురస్కారాలను అందజేసి తెలుగు ప్రజలను ఉద్దేశించి ప్రసంగించాలని గవర్నర్‌ను కోరారు. ఈ సందర్భంగా గవర్నర్ సానుకూలంగా స్పందించారని గజల్ శ్రీనివాస్ తెలిపారు.

బీఫార్మసీ పరీక్షలను పరిశీలించిన సమన్వయకర్త సుబ్బారావు

ఏఎన్‌యూ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న బీ-ఫార్మసీ (రెగ్యులర్, సప్లిమెంటరీ) పరీక్షలను మంగళవారం పీజీ, వృత్తివిద్య కోర్సుల పరీక్షల సమన్వయకర్త ఆచార్య ఎం.సుబ్బారావు పరిశీలించారు. విశ్వవిద్యాలయం క్యాంపస్ ఫార్మసీ కళాశాల పరీక్ష కేంద్రాన్ని ఆయన సందర్శించి పరీక్షలు జరిగే తీరును చూశారు. ఆయన విద్యార్థుల హాల్ టికెట్లు, జవాబుపత్రాలు తదితర వాటిని పరిశీలించారు. అలాగే పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు కల్పించిన సదుపాయాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించాలని ఆయన పరీక్షా కేంద్రం నిర్వహకులకు సూచించారు.

హత్య కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

మంగళగిరి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి కొత్తపేటలో సుమారు ఏడేళ్ల క్రితం జరిగిన ఓ హత్య కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ గుంటూరు జిల్లా మూడో ఏడీజే కోర్టు న్యాయమూర్తి సీ వెంకట నాగశ్రీనివాసరావు తీర్పు చెప్పారు. మంగళగిరి పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఎర్రబాలెం గ్రామానికి చెందిన బొద్దులూరి వెంకట రమణ (43), కొత్తపేటకు చెందిన మోటుకూరి భాస్కరరావులు 2019, ఫిబ్రవరి 8వ తేదీన రాత్రి పదిన్నర గంటల సమయంలో ఎర్రబాలెంలో మద్యం సేవించి ఘర్షణ పడ్డారు. అనంతరం ఎవరి ఇంటికి వారు వెళ్లిపోగా, అర్ధరాత్రి రమణ కొత్తపేటలోని భాస్కరరావు నివాసానికి వెళ్లి మరోమారు గొడవకు దిగాడు. దీంతో కోపోద్రిక్తుడైన భాస్కరరావు ఇంట్లోని కుట్టుమిషన్‌పై వున్న కత్తెరతో రమణను పొట్టలో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన రమణ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అప్పటి సీఐ సీహెచ్ రవిబాబు నిందితుడు భాస్కరరావును అరెస్టు చేసి న్యాయస్థానంలో చార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసులో జిల్లా మూడో ఏడీజే కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముబీనా బేగం వాదనలు వినిపించగా, న్యాయమూర్తి వెంకట నాగశ్రీనివాసరావు ముద్దాయి భాస్కరరావుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పినట్టు మంగళగిరి పట్టణ పోలీసులు తెలిపారు.

స్కూటీ అదుపుతప్పి ఒకరి మృతి

చేబ్రోలు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : స్కూటీ అదుపుతప్పి రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు వద్ద మంగళవారం జరిగింది. ప్రముఖ ధార్మికవేత్త తబ్లిగ్ జమాత్ పొన్నూరు మండలం అమీర్(ఇన్‌చార్జి)గా వ్యవహరిస్తున్న మగ్బుల్ జానీ(74) భార్య షంషాద్ బేగంతో కలిసి స్కూటీపై వెళుతుండగా నారాకోడూరు సమీపంలో స్కూటీ వెనుక టైర్ బరస్ట్ కావడంతో అదుపుతప్పి రోడ్డుప్రమాదానికి గురయ్యారు. షంషాద్ బేగంకు స్వల్పగాయలుకాగా, తీవ్రంగా గాయపడిన మగ్బుల్ జానీని స్థానికులు వడ్లమూడిలోని ప్రైవేట్ వైద్యశాలకు తీసుకువెళ్ళగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు.

పసుపు రైతులకు వ్యాపారి టోకరా

రూ. 3 కోట్ల వరకు సరుకు కొని పత్తా లేకుండా పోయిన వ్యాపారి

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పసుపు రైతులకు వ్యాపారి టోకరా వేశాడు. సుమారు మూడు కోట్ల రూపాయల వరకు సరుకులు కొని పత్తా లేకుండా పోయాడని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. హుబ్లీలో ఉండే ఒక వ్యాపారి రాజుపాలెం మండలం గణపవరం గ్రామానికి చెందిన బ్రోకర్ ద్వారా సత్తెనపల్లి మండలం అబ్బూరు, లక్కరాజు గార్లపాడు, రాజుపాలెం మండలం గణపవరం, వినుకొండ, ఫిరంగిపురం మండలాల్లోని పలు గ్రామాల్లో గత ఏడాది ఏప్రిల్‌లో సుమారు 15 మంది రైతుల వద్ద నుంచి పసుపును కొనుగోలు చేశారు. కొనుగోలు అనంతరం కొద్ది రోజుల్లోనే నగదు చెల్లిస్తానని బ్రోకర్ ద్వారా రైతులను మభ్య పెట్టాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎప్పుడు ఫోన్ చేసిన సమాధానం దాట వేస్తున్నాడని, గట్టిగా నిలదీసే సరికి రెండు నెలలుగా వ్యాపారి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడని బాధిత రైతులు వాపోయారు. బ్రోకర్‌ను అడిగినా ఏ సమాధానం చెప్పకుండా మిన్నకుండి పోతున్నాడన్నారు. దీంతో రైతులు చేసేది లేక పోలీసులను ఆశ్రయించారు. ఎవరెవరు ఎంత పసుపు అమ్మింది, ఎంత మొత్తం రావాలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని పోలీసులను వారు వేడుకున్నారు. ఐతే ఈ విషయాన్ని పోలీసులు మాత్రం ధ్రువీకరించటం లేదు. బాధిత రైతులు ఇంకా ఎక్కువ మొత్తంలో ఉండే అవకాశం ఉందని రైతులు చెపుతున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	125, 134, 145
చికెన్ విత్ స్కిన్(కిలో)	236.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	246.00

30,716 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 32,349 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 30,716 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 8,794 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	12000
334	10500	14300	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	13800	334	10500	14500
273	----	----	నెంబరు. 5	10000	14000
341	10000	14800	273	----	----
4884	----	----	341	10000	15000
సూపర్ 10	----	----	4884	10000	15000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14600	తేజ	10000	14800
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15000
బ్యాడిగి	10000	15000	దేవనూరు డీలక్స్	10500	14200
దేవనూరు డీలక్స్	10000	14000	తాలుకాయలు	5000	7000

ఉత్కంఠగా చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు

- రేపటితో నామినేషన్‌ల ఉపసంహరణకు తుదిగడువు
- నామినేషన్‌లు దాఖలు చేసిన బాలకృష్ణ వర్గం
- ఉప సంహరించుకోకుంటే ఎన్నికలు ఖాయమే

గుంటూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యాపారవర్గాలకు ప్రతిష్టాత్మకమైన ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గం ఎన్నికపై ఈ దఫా ఉత్కంఠత కొనసాగుతోంది. ప్రస్తుత కార్యవర్గం గడువు ఈనెల 29తో ముగియనున్న నేపథ్యంలో ఎన్నికలా లేక ఏకగ్రీవమా అనే ప్రచారం జోరందుకుంది. నామినేషన్‌ల ఉప సంహరణకు ఈ నెల 25 తుది గడువు కావటంతో రేపటితో ఎన్నికల వ్యవహారం తేలిపోనున్నది. జిల్లాలో సుదీర్ఘ చరిత్ర కలిగిన ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్‌కు జిల్లా అధ్యక్షుడుగా మూడు దశాబ్దాలకు పైగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఆతుకూరి ఆంజనేయులు ప్రస్తుతం చాంబర్‌కు శాశ్వత గౌరవాధ్యక్షుడుగా వ్యవహరిస్తున్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గం గడువు ఏడాది పాటు ఉంటుంది. కార్యవర్గం పదవీ కాలం ముగిసే లోపు సర్వసభ్య సమావేశం నిర్వహించి బరిలో ఎవరూ నిలవకపోతే కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం జరిగేది. ఇది గతంలో జరుగుతున్న ప్రక్రియ. అయితే గత ఏడాదిలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష అభ్యర్థిగా రంగా బాలకృష్ణ బరిలో నిలవటంతో ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఆ సమయంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష అభ్యర్థిగా మాజీ కార్పొరేటర్ యేల్చూరి వెంకటేశ్వర్లు ప్యానల్, రంగా బాలకృష్ణ ప్యానల్‌లు ఎన్నికల బరిలో నిలిచాయి. హోరా హోరీగా పోటీ పడుతూ ప్రచారం నిర్వహించగా యేల్చూరి ప్యానల్ విజయం సాధించింది. తాజాగా ఈనెల 29తో కార్యవర్గం గడువు ముగిసి మరోసారి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. అయితే ఈ దఫా కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవమా లేక ఎన్నికలు జరుగుతాయా అనేది చర్చనీయాంశంగా మారింది. గతంలో చాంబర్ కార్యదర్శిగా సుదీర్ఘకాలం వ్యవహరించిన రంగా బాలకృష్ణ ఈ దఫా కూడా తాను అధ్యక్ష పదవికి ఎన్నికల బరిలో నిలిచేందుకు పట్టుదలతో ఉన్నట్లు చాంబర్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే చాంబర్ అధ్యక్ష స్థానానికి బాలకృష్ణ, కార్యదర్శి పదవికి రంగా రామకృష్ణ, ఉపాధ్యక్షులు, ఈసీ సభ్యులుగా పది మంది వరకు నామినేషన్‌లు దాఖలు చేశారు.

● ఎన్నికలపై ఉత్కంఠ....

నామినేషన్‌లు ఉప సంహరణకు 25న తుది గడువు కాగా ఆ రోజు సాయంత్రం ఐదు గంటల్లోపు ఉప సంహరించుకోకుంటే ఎన్నికలు ఖాయంగా చెబుతున్నారు. ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్‌కు 8 దశాబ్దాల చరిత్ర ఉంది. అధ్యక్ష, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, ఈసీ సభ్యులు మొత్తంగా 48 మంది కార్యవర్గంగా ఉంటారు. చాంబర్‌కు 70 వరకు అనుబంధ సంఘాలున్నాయి. ఇందులో 3వేల మంది పైనే సభ్యులు ఉన్నారు. వారందరిని ఓటర్లుగానే పరిగణిస్తారు. ఈ క్రమంలో మరోసారి ఎన్నికలపై ఉత్కంఠ కొనసాగుతోంది.



రోగులకు మందులు అందజేస్తున్న డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు

జీవనశైలి మార్పులతోనే దీర్ఘకాలిక వ్యాధుల దాడి

- ఉచిత వైద్య శిబిరంలో భాష్యం రామకృష్ణ వెల్లడి

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జీవనశైలిలో వచ్చిన మార్పుల కారణంగానే నేడు పలు రకాల దీర్ఘకాలిక జబ్బులు వేధిస్తున్నాయని భాష్యం విద్యా సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ తెలిపారు. జాతీయ ఆయుర్వేద దినోత్సవం పురస్కరించుకొని ఇన్నర్ రింగ్‌లోని శ్రీవెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ఉచిత ఓపీ వైద్యసేవల శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో భాష్యం రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు ప్రాచీన వైద్య విధానం ఆయుర్వేదంతో చక్కటి పరిష్కారం లభిస్తుందని తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయుర్వేద వైద్యం ప్రోత్సహించేందుకు ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. శ్రీవెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ చైర్మన్, పంచకర్మ వైద్యనిపుణులు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సెప్టెంబర్ 23న జాతీయ ఆయుర్వేద దినోత్సవంగా పాటించాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించినట్లు తెలిపారు. అనంతరం జరిగిన ఉచిత ఓపీ వైద్యశిబిరంలో 250 మంది రోగులకు నాడీ వైద్య పరీక్షలు చేసి చికిత్సలు సూచించారు. రూ.90 వేలు విలువైన మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కొండా వెంకటేశ్వర్లుతో పాటు వైద్య బృందం డాక్టర్ రాహుల్ చంద్ర, డాక్టర్ భావన, మేనేజర్ మల్లీశ్వరి పాల్గొన్నారు.

మానవాళికి గొప్ప వరం ఆయుర్వేదం

గుంటూరు (విద్య) సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆయుర్వేద పితామహుడు ధన్వంతరి జయంతిని జాతీయ ఆయుర్వేద దినోత్సవంగా జరుపుకోవడం మన మూలాలను స్మరించుకోవడమేనని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం భాష్యం మెడెక్స్ మెడి ఎయిమ్స్ క్యాంపస్ లలో ఆయుర్వేద పితామహుడు ధన్వంతరికి భాష్యం రామకృష్ణ నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పూర్వీకులు మానవాళికి ఇచ్చిన గొప్ప వరం ఆయుర్వేదం అని, దానిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎంతో మంది మునులు, రుషులు ఆయుర్వేదం ద్వారా ఎన్నో వ్యాధులను నయం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో భాష్యం మెడెక్స్ ప్రిన్సిపాల్ హరిబాబు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న భాష్యం రామకృష్ణ

దేశీయ వైద్యం బలోపేతానికి కృషి

- రాష్ట్ర ఔషధ, సుగంధ మొక్కల బోర్డు సీఈవో చంద్రశేఖర్

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): దేశీయ వైద్యానికి అవసరమైన ఔషధ, సుగంధ మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నట్టు రాష్ట్ర ఔషధ, సుగంధ మొక్కల బోర్డు సీఈవో ఆవుల చంద్ర శేఖర్ అన్నారు. ప్రపంచ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ దేశీయ వైద్య సంఘం, ఆంధ్రప్రదేశ్ ఔషధ, సుగంధ మొక్కల బోర్డు సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం గుంటూరు, అరండల్‌పేట ఆర్య సమాజంలో ఔషధ మొక్కల నిర్వహణ, వినియోగంపై రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మంచి అనారోగ్యానికి సంబంధించిన ప్రతి ఔషధం మొక్కల ద్వారానే ఉపశమనం కలుగుతుందన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి హిమ శైలజ మాట్లాడుతూ ఔషధ, సుగంధ మొక్కల నర్సరీలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో దేశీయ వైద్య సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఏ గోరీష్ బాబు అధ్యక్షుడు డాక్టర్ వి వి వెంకటనారాయణ, అధికారులు, సిబ్బంది, వైద్యులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఈవో ఆవుల చంద్రశేఖర్, అధికారులు

చిల్డ్రన్స్ హోంని సందర్శించిన డీఆర్ఎం

గుంటూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాల్లో భాగంగా గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ సుధేష్ణ సేన్ రవీంద్రనగర్‌లోని మాతృశ్రీ చిల్డ్రన్స్ హోంని సందర్శించారు. మంగళవారం ఆమె డివిజనల్ రైల్వే అధికారులతో కలిసి ఆ బాలల కేంద్రాన్ని సందర్శించి పిల్లలతో సంభాషించారు. ఈ సందర్భంగా వాళ్ల అవసరాలను తెలుసుకొని దుస్తులు, కిరాణ సామగ్రి, రీయూజబుల్ ప్లాస్టిక్ వస్తువులు వంటివి పంపిణీ చేశారు. పరిసరాల పరిశుభ్రతపై పిల్లలకు అవగాహన కల్పించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని వినియోగించొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం రమేష్‌కుమార్, వివిధ విభాగాల అధికారులు షాబాజ్ హనూర్, ఎం రవి కిరణ్, అమూల్య బీ రాజ్ పాల్గొన్నారు.



రవీంద్రనగర్‌లోని మాతృశ్రీ చిల్డ్రన్ హోంని సందర్శించి పిల్లలకు దుస్తులు, ఇతర సామగ్రిని పంపిణీ చేసిన డీఆర్ఎం సుధేష్ణ సేన్

జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలి

- కలెక్టరేట్ ఎదుట నిరసన

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసి, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) జిల్లా కార్యదర్శి షేక్ వలీ డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నోటిఫికేషన్ ఇచ్చే వరకు అభ్యర్థులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. పేద యువతకు ఉచిత స్టడీ సర్కిల్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చి, మెటీరియల్స్ పంపిణీ చేయాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో నిరుద్యోగ సమస్యలపై చర్చించి తీర్మానాలను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనల్లో జంగాల చైతన్య, శ్రీనివాసరావు, చల్లా మరియదాసు, యశ్వంత్, బన్నీ, వాసు, గోపి, నవీన్, రెహమన్, ఖాదర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

కలరా, డయేరియా మరణాలు లేవు

- రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం
- పూర్తి అదుపులో డయేరియా
- డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి వెల్లడి

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం ఎటువంటి కొత్త కలరా కేసులు నమోదు కాలేదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే విజయలక్ష్మి తెలిపారు. డయేరియా పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని వివరించారు. మంగళవారం ఈ మేరకు ఆమె పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకు గుంటూరు నగరంలో 3 కలరా కేసులు నమోదు అయ్యాయని (సుద్దపల్లి డొంకలో రెండు, రామిరెడ్డి తోటలో ఒకటి), వారి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. కలరా, డయేరియా బాధితులు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. వాంతులు విరోచనాలతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో గత 5 రోజులలో 120 మంది చేరారని, వారిలో 50 మంది పూర్తిగా కోలుకొని డిశ్చార్జి అయ్యారని, వీరిలో ఎక్కువ మంది రోగులు పాతగుంటూరు పరిసర ప్రాంతాల నుంచి వచ్చారని వివరించారు. వీరిలో ఇప్పటి వరకు ముగ్గురికి మాత్రమే మలం కల్చర్ పరీక్షల్లో కలరా నిర్ధారణ అయినదని, మిగిలిన అందరికి మలం కల్చర్ రిపోర్ట్ నెగిటివ్‌గా వచ్చిందన్నారు. అందరికి సమగ్ర వైద్యశాలలో మెరుగైన వైద్యం అందించడం వల్ల ఎటువంటి మరణాలు సంభవించలేదని చెప్పారు. నగరంలో 217 నీటి నమూనాలను సేకరించి బ్యాక్టీరియా, రసాయన పరీక్షల కోసం పంపినట్లు తెలిపారు. తాడేపల్లిలోని మణిపాల్ ఆసుపత్రిలో హైదరాబాదు నుంచి వచ్చి చికిత్స పొందుతున్న కలరా సోకిన మహిళ కోలుకోవడంతో మంగళవారం డిశ్చార్జ్ అయ్యారని తెలిపారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం...

ప్రతి ఇంటికి ఆరోగ్య సిబ్బంది తిరుగుతూ కాచి చల్లార్చిన నీరు తాగాలని, చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలని ఆరోగ్య సిబ్బంది వివరిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. మున్సిపల్ సిబ్బంది పరిసరాల పరిశుభ్రత, పూడికలు తీయటం చేస్తున్నారని చెప్పారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ ఆదేశానుసారం నీటి పైపుల మరమ్మతు కార్యక్రమం కొనసాగుతుందని పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని వివరించారు. నగరంలో డయేరియా ప్రబలిన ప్రాంతాల్లో వైద్యాధికారులు వైద్య శిబిరాలు నిర్వహిస్తూ, ఇంటింటి సర్వే కొనసాగిస్తున్నారని ఆమె తెలిపారు. 24 గంటలూ వైద్య శిబిరాలు మంగళదాసునగర్ ఎదురుగా ఉన్న సరస్వతి స్కూల్‌లో, 7వ లైన్ గవర్నమెంట్ స్కూల్, గుంటూరువారితోట బంగ్లా స్కూల్, ఎల్బీ నగర్, పాతగుంటూరులోని శ్రీ కృష్ణుని కల్యాణ మండపంలో, శ్రీనివాసరావుతోటలో, లాంచెస్టర్ రోడ్‌లోని వడ్డెర గూడెం మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నామన్నారు.

యువత భవిష్యత్‌ను దెబ్బతీస్తున్న డ్రగ్స్ : సౌత్ డీఎస్పీ

గుంటూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : యువత భవిష్యత్‌ను దెబ్బతీస్తున్న డ్రగ్స్ వద్దు బ్రో అని సౌత్ డీఎస్పీ భానోదయ అన్నారు. ఈ మేరకు నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని స్వర్ణభారతినగర్‌లో నల్లపాడు పోలీసులు మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో డీఎస్పీ భానోదయ మాట్లాడుతూ, డ్రగ్స్ వాడకం యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందన్నారు. ప్రతి యువకుడు, ప్రతి వ్యక్తి డ్రగ్స్‌కి దూరంగా ఉండాలని సంకల్పం చేసుకోవాలన్నారు. డ్రగ్స్ సరఫరా, విక్రయం, వాడకం చట్ట రీత్యా నేరం అన్నారు. అటువంటి నేరాలకు ఎవరైనా పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డ్రగ్స్ వాడకం లేదా విక్రయం ఎక్కడైనా కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సౌత్ డీఎస్పీతో పాటు, నల్లపాడు సీఐ వంశీధర్, ఈగల్ ఆర్ఎస్సై సునీల్ , నల్లపాడు ఎస్సై శిరీష, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బ్రాడీపేట, పండరీపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ ఎన్.గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.



లోక్ అదాలత్‌లో పాల్గొన్న న్యాయాధికారులు, రైల్వే అధికారులు

లోక్ అదాలత్‌లో 24 కేసుల పరిష్కారం

గుంటూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజుల పాటు రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ అమరావతి బెంచ్‌లో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 24 కేసులు పరిష్కారం అయ్యాయి. ఈ అదాలత్‌కు మొత్తం 31 కేసులు వచ్చాయని న్యాయాధికారులు తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇది రెండో లోక్ అదాలత్ అని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌సీటీ అమరావతి బెంచ్ జ్యూడీషియల్ సభ్యురాలు ఆర్.సత్యభామ, అదనపు రిజిస్ట్రార్ కే.రాజేంద్ర ప్రసాదు, ఎస్‌సీఆర్ క్లెయిమ్స్ డిప్యూటీ సీసీఎం వై బాలాజీ కిరణ్, గుంటూరు పీవో ఏసీఎం ఆర్‌వీ మోసెస్ క్రిష్టియన్ పాల్గొన్నారు.

నంది ఇన్వెస్టిగేషన్ సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థకు గోల్డ్ కేటగిరి అవార్డు

గుంటూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): గుంటూరు కేంద్రంగా పని చేస్తున్న నంది ఇన్వెస్టిగేషన్ సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థకు వెర్టిస్ అంతర్జాతీయ కంపెనీ గోల్డ్ కేటగిరి అవార్డును అందచేసింది. రాష్ట్రంలో నేషనల్ హైవే అథారిటీ సంస్థ జాతీయ రహదారులు నెంబర్ 5, 9లోని టోల్ ప్లాజాలకు నంది ఇన్వెస్టిగేషన్ సెక్యూరిటీ సర్వీసెస్ కు 2014 నుంచి లేన్ ఆపరేషన్స్, మొబైలింగ్ పెట్రోలింగ్ నిర్వహణలో ఏ రిమార్కులు లేకుండా సేవలు అందించినందుకు అంతర్జాతీయ కంపెనీ వెర్టిస్ సంస్థ ఈనెల 19న ముంబైలోని పూణే ఎక్స్‌ప్రెస్ హైవేలోని నోవాటెల్‌లో జరిగిన సదస్సులో నంది ఇన్వెస్టిగేషన్ సెక్యూరిటీ సర్వీసెస్ మేనేజింగ్ పార్టనర్ కాళహస్తి సత్యనారాయణకు 'వెర్టిస్' అధినేతలు డాక్టర్ జాఫర్ ఖాన్, గౌరవ్ చందన, కిరణ్‌బాబు ఆపరేషన్స్ ఆఫీసర్‌లు గోల్డ్ క్యాటగిరి కింద ప్రశంసా పత్రాన్ని షీల్డ్‌ను బహూకరించారు. టోల్ ప్లాజా చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ కిరణ్ బాబు, చీఫ్ ఆపరేటింగ్ మేనేజర్‌లు హరిపాండురంగ స్వామి, మాచర్ల రాజారావు, టోల్ ప్లాజా మేనేజర్లు, నేషనల్ హైవే అథారిటి సిబ్బంది అభినందనలు తెలిపారు. గుంటూరులో మంగళవారం సెక్యూరిటీ సిబ్బంది మిత్రులు ఘనంగా సత్కరించారు. సంస్థ ఎండీ కె.సత్యనారాయణ మాట్లాడుతూ అవార్డు దక్కడానికి సిబ్బంది, అధికారులు చేసిన కృషి మరువలేనిదన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలి

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి స్పష్టమైన ప్రకటన చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేట, మల్లయ్య లింగం భవన్లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం కార్మిక సంక్షేమాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, దీంతో వేలాది క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉండిపోయాయని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా వాటిపై దృష్టి పెట్టలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రావుల అంజిబాబు, డేగల వెంకటేశ్వరరావు, నూతలపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రంగస్థలం నటుడు వైఎస్ కృష్ణేశ్వరరావుకు ఆర్థిక చేయూత

గుంటూరు (విద్య) సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రంగస్థలం, సినీ నటులు వైఎస్ కృష్ణేశ్వరరావుకు ఈశ్వర వరప్రసాద్ కళాపరిషత్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించారు. స్థానిక ఏటి అగ్రహారంలోని కృష్ణేశ్వరరావు స్వగృహంలో మంగళవారం సభ్యులు కలిశారు. ఇటీవల అనారోగ్య కారణాలతో ఇబ్బంది పడుతున్న సందర్భంగా ఈశ్వర వరప్రసాద పరిషత్తు వారు 50 వేల రూపాయలు నగదు శాలువా విలువైన జ్ఞాపక తో ఉత్తమ సాహిత్య పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో పరిషత్ చైర్మన్ మోదుగుల రవికృష్ణ సభ్యులు సెట్లం చంద్రమోహన్, పి సత్యనారాయణ రాజు, పసుపులేటి శ్రీధర్, మారెళ్ళ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

బహురూప అంబికకు జేజేలు

- వైభవంగా దసరా ఉత్సవాలు
- పలు రూపాల్లో అమ్మవారి దర్శనం



శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రీ గజలక్ష్మీఅలంకరణలో అమ్మవారు



బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళగౌరిగా అమ్మవారు



అరండల్‌పేట, అష్టలక్ష్మీ ఆలయంలో శ్రీ గాయత్రీమాతగా అమ్మవారు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): నగరంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజున మంగళవారం అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గో పూజ, సువాసిని, కుమారి పూజలు సువాసినులచే సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. పలు దేవాలయాల్లో అమ్మ వారిని అన్నపూర్ణదేవి, గాయత్రిదేవి, లలిలా పరమేశ్వరీ, మంగళగౌరిగా అలంకరించారు. పెద్దఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు అందుకున్నారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

● గుంటూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రుల సంద ర్భంగా నగరంలో దసరా శోభ సంతరించుకున్నది. రంగురంగుల విద్యుద్దీపా లతో దేదీప్యమానంగా ఆలయాలను ముస్తాబు చేశారు. నగరంలోని ఏటు కూరు రోడ్డులోనున్న శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు రెండో రోజున మంగళవారం శ్రీ గజలక్ష్మీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ కమిటీ చైర్మన్ కోట శేషగిరిరావు, గౌరవ సలహాదారు కొనకళ్ళ సత్యం, ఆలయ ఈవో ఎన్.శ్రీనివాసరావులు భక్తులకు దర్శన ఏర్పాట్లు పర్యవేక్షిం చారు. పొన్నూరు రోడ్డు సంగడిగుంటలోని శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానంలో అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. సామూహిక కుం కుమపూజలు జరిగాయి. భారీగా తరలివచ్చే భక్తులకు ప్రత్యేక క్యూలైన్‌లను ఏర్పాటు చేసినట్లు కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు మారెడ్డి శ్రీనివాసరెడ్డి, మద్దిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, మోరబోయిన నరసింహరావు తెలిపారు. అలానే చుట్టుగుంట శ్రీ పోలేరమ్మ తల్లి దేవస్థానంలో దసరా నవరాత్రులకు అంగ రంగ వైభవంగా ఏర్పాట్లు చేశారు. రెండో రోజు శ్రీ గాయత్రీదేవి అలంక రణలో అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. నవరాత్రులకు ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు.

● గుంటూరు కార్పొరేషన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కొత్తపేటలోని శ్రీ జగన్నాథ స్వామి దేవస్థానంలో రుక్మిణి అమ్మవారు రెండో రోజు మంగళవారం ధాన్యలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉత్సవాలను అత్యంత భక్తి శ్రద్ధలతో జరిపిస్తున్నారు. లాలాపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో పద్మావతి అమ్మవారు రెండో రోజు మంగళవారం ఐశ్వర్య లక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే నసీర్



మంత్రి బీసీ జనార్దన్ రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని నందివెలుగు రోడ్డులో బ్రిడ్జిపై కల్వర్టు నిర్మాణానికి సహకరించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కోరారు. శాసన సభలో మంగళవారం మంత్రికి వినతి పత్రం అందజేశారు. గత 50 ఏళ్లుగా ఈ బ్రిడ్జిపై కల్వర్టు నిర్మాణం లేకపోవడంతో మురుగునీటి ప్రవాహానికి తీవ్ర ఆటంకం ఏర్పడుతుందని వివరించారు. దీంతో భారీ వర్షాల సమయంలో నగరంలో మురుగునీటి ప్రవాహం వేగంగా వెళ్లే అవకాశం లేక లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయని తెలిపారు. నందివెలుగు రోడ్డులోని బ్రిడ్జిపై కల్వర్టు నిర్మాణానికి రూ.2.5 ఐదు కోట్లు అవసరమని ఈ నిధుల మంజూరుకు పరిపాలనపరమైన అనుమతులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే నసీర్ విన్నవించారు. ఎమ్మెల్యే నసీర్ వినతి మేరకు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు.

మార్కెట్లోకి మొక్కజొన్నలో కలుపు మొక్కల నివారణి బ్యసియా విడుదల

గుంటూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంటలో కలుపు మొక్కల నివారిణిగా పనిచేసే శక్తివంతమైన, సురక్షితమైన మందు యూపీఎల్ సస్టైనబుల్ అగ్రి సొల్యూషన్స్ బ్యసియాను మార్కెట్లోకి విడుదల చేశారు. పలకలూరు రోడ్డులోనున్న గుంటూరు క్లబ్‌లో మంగళవారం కంపెనీ ప్రతినిధులు బ్యసియాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ సీఈవో రవిశంకర్ మాట్లాడుతూ మొక్కజొన్న రైతులకు పెరుగుతున్న సవాళ్ళను పరిష్కరించటానికి ప్రత్యేకంగా హెర్బిసైడ్ అయిన బ్యసియాను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. కలుపు నిరోధకత పెరగటం, మారుతున్న వాతావరణ పరిస్థితులతో బ్యసియా విశ్వసనీయమైన పరిష్కారాన్ని అందిస్తుందన్నారు. ఇది అత్యంత క్లిష్టమైన ప్రారంభ వృద్ధి దశలలో రైతులు తమ పంటలను రక్షించటానికి ఉపయోగపడుతుందన్నారు. రెండు నుంచి నాలుగు కలుపు ఆకు దశలో ప్రతి ఎకరానికి 50 మిలీ మోతాదులో వాడాలని, ఇది విస్తృత శ్రేణి ఆకు, గడ్డి కలుపులపై వేగంగా నియంత్రణ అందిస్తుందన్నారు. మొక్కజొన్న రైతులకు మెరుగైన ఉత్పాదకత, వ్యవసాయ లాభదాయకత కోసం పరిష్కారాన్ని అందిస్తుందన్నారు. కార్యక్రమంలో స్టేట్ హెడ్ కేబీఆర్, స్టేట్ మార్కెటింగ్ హెడ్ హరికృష్ణ ఉన్నారు.



బ్యసియా కలుపు మొక్కల నివారిణి మందును విడుదల చేస్తున్న సీవోవో రవిశంకర్, మార్కెటింగ్ హెడ్ హరికృష్ణ తదితరులు

తెలుగు కవిత్వపు నుడికారం జాషువా

- మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలుగు కవిత్వపు నుడికారం కవికోకిల గుర్రం జాషువా అని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాదు పేర్కొన్నారు. మహాకవి గుర్రం జాషువా జయంతి వారోత్సవాల సందర్భంగా మంగళవారం నగరంపాలెంలోని జాషువా విగ్రహం వద్ద అత్తోట జోసఫ్ కుమార్ అధ్యక్షతన జాషువా సాహిత్యం - సామాజిక సంస్కరణ అంశంపై సభ జరిగింది. తొలుత జాషువా విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డొక్కా మాణిక్య వరప్రసాదు మాట్లాడుతూ మహాకవి జాషువా సమకాలీన భావ కవిత్వ సంప్రదాయం నుంచి పక్కకు జరిగి సామాజిక సంస్కరణ ప్రయోజనం ఆశించి రచనలు చేశారన్నారు. అట్టడుగు కులంలో పుట్టి అనేక అవమానాలు ఏదుర్కొని అంతే కసితో కవిత్వంలో అద్భుతాలు సృష్టించి మహాకవిగా ప్రజల నాలుకలనందు నిలిచి పోయారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది చందవోలు శోభారాణి, పినపాటి మోహన రావు, దర్శనపు శ్రీనివాస్, కవి దేవరపల్లి ప్రభుదాస్, నల్లపు నీలాంబరం, తాటికొండ నరసింహారావు, బత్తుల కోటేశ్వరరావు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న డొక్కా మాణిక్యవరప్రసాదు

తెలకపల్లికి జాషువా పురష్కారం

- మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మహాకవి గుర్రం జాషువా 130వ జయంతి పురస్కరించుకుని ఈనెల 27న జాషువా విజ్ఞాన కేంద్రంలో జరిగే జాషువా కవితా పురస్కార సభను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు అన్నారు. బ్రాడీపేట, సిపిఎం కార్యాలయంలో మంగళవారం జయంతి సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ప్రముఖ పాత్రికేయుడు, రాజకీయ విశ్లేషకుడు తెలకపల్లి రవికి కవితా పురస్కారం అందజేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ భావన్నారాయణ, ఈమని అప్పారావు, గాదె సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

28న గుర్రం జాషువా జయంతి సభ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వల్లూరి జయప్రకాష్, బీజేపీ నాయకులు

గుంటూరు (తూర్పు), సెప్టెంబరు 23(ఆంధ్ర జ్యోతి): భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో స్థానిక నగరంపాలెం వద్ద ఈ నెల 28న కవి కోకిల గుర్రం జాషువా జయంతి సభను నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ తెలిపారు. అరండల్‌పేట, రంగనాయక స్వామి గుడిలో మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, దర్శనపు శ్రీనివాస్, బ్రహ్మయ్య, వెలగలేటి గంగాధర్ డాక్టర్ టివి రావు, చరక కుమార్ గౌడ్, మంత్రి సుగుణ, సాధు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నరసరావుపేట : శృంగేరి శంకరమఠంలో శ్రీ శారదాంబ అమ్మవారికి కౌమారి అలంకారం

పెదకాకాని : గాయత్రీ దేవి అలంకారంలో భ్రమరాంబ అమ్మవారు

అమరావతి : బాలాత్రిపురసుందరీ దేవిగా బాలచాముండికా అమ్మవారు

వైభవంగా దసరా ఉత్సవాలు

అమరావతి/నరసరావుపేట/పెదకాకాని, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల్లోని దేవాలయాల్లో దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు ఆలయాలకు తరలి వచ్చి అమ్మవారి ప్రత్యేక అలంకారాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా రెండో రోజు బాలచాముండికా సమేత అమరావతి అమరేశ్వరాలయంలో అమ్మవారిని బాలాత్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. ఆలయ మొదటి ప్రాకారంలో ఉన్న జ్వాలాముఖి అమ్మవారిని కూడా పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానంలోని భ్రమరాంబ అమ్మవారు గాయత్రి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో దసరా ఉత్సవాలను సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు. నరసరావుపేటలోని శృంగేరి శంకరమఠంలో శ్రీ శారదాంబ అమ్మవారికి కౌమారి అలంకారం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పలు పట్టణాలు, గ్రామాల్లో దేవీ మండపాలను ఏర్పాటు చేసి దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

దీక్షతో.. పాఠం

● చదివి వినేలా యాప్ రూపకల్పన
● పుస్తకాలపై క్యూఆర్ కోడ్ స్కాన్‌తో అవకాశం

సత్తెనపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తరగతి గదిలో ఉపాధ్యాయుడు పాఠం బోధించినా కొంతమంది విద్యార్థులకు అర్థం కాదు. టీచర్ అడగాలంటే భయం.. సందేహాలు నివృత్తి చేసుకోవాలంటే బిడియం. పాఠాలు సక్రమంగా విన్నప్పటికీ భయం.. బిడియంతో తెలివైన విద్యార్థులు కూడా పరీక్షల్లో వెనుకబడి పోతున్నారు. దీంతో తరగతి గదిలో ఉపాధ్యాయుడి బోధించినట్లుగానే ఇళ్ల వద్ద విద్యార్థులు పాఠం వినేలా.. అర్థం చేసుకునేలా కేంద్ర ప్రభుత్వం దీక్ష పేరుతో ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించింది. ఈ యాప్ ద్వారా మరోసారి పాఠాలు విని.. చదివి సులువుగా అర్థం చేసుకునే అవకాశం విద్యార్థులకు వచ్చింది. గూగుల్ ప్లే స్టోర్ ద్వారా ఫోన్‌లో దీక్ష యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పాఠ్య పుస్తకంపై ముద్రించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే కావాల్సిన పాఠ్యాంశాలు సవివరంగా కన్పిస్తాయి. ఎన్‌సీఆర్‌టీతో పాటు రాష్ట్ర సిలబస్ పాఠాలు ఈ యాప్‌లో అందుబాటులో ఉంటాయి. దివ్యాంగులకు ఆడియో పాఠాలతో పాటు పది వేలకు పైగా డిక్షనరీ పదాలు ఉన్నాయి.



క్యూఆర్ కోడ్‌తో ఉన్న పుస్తకాలు

ఎన్నో ప్రయోజనాలు

1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు అన్ని రకాల పాఠ్య పుస్తకాలపై క్యూఆర్ కోడ్‌ను ప్రచురించింది. దీక్ష యాప్ దాని ద్వారా ఆయా పాఠ్యాంశాలను విద్యార్థులు పూర్తిగా చదువుకుని తేలిగ్గా అర్థం చేసుకోవచ్చు. పాఠ్యాంశాలపై పట్టు సాధించేలా యాప్‌ను రూపకల్పన చేశారు. యాప్ ద్వారా అభ్యసించడం వల్ల విద్యార్థుల్లో అవగాహన సామర్థ్యం పెరుగుతుంది.

-శ్రీనివాసరావు, ఎంఈవో సత్తెనపల్లి

క్రీడలకు ఉజ్వల భవిష్యత్తు : మంత్రి రాంప్రసాద్ రెడ్డి



మాట్లాడుతున్న క్రీడలు, యువజన సర్వీసుల శాఖా మంత్రి రాంప్రసాద్ రెడ్డి

ఏఎన్‌యూ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖా మంత్రి ఎం రాంప్రసాద్ రెడ్డి అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో 36వ దక్షిణ మండల జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ పోటీలు, ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ క్రీడల విధానంలో నూతన అధ్యాయం ప్రారంభమైందన్నారు. ఆధునిక సాంకేతికతను క్రీడల రంగానికి జోడించుట ద్వారా అద్భుత ఫలితాలు సాధించవచ్చు అన్నారు. ప్రభుత్వానికి సమాంతరంగా పలు అథ్లెటిక్ అసోసియేషన్లు, మల్టీ నేషనల్ కంపెనీలు క్రీడలను ప్రోత్సహించడం సంతోషకరమని తెలిపారు. తొలుత అథ్లెటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పతాకాన్ని మంత్రి రాంప్రసాద్ రెడ్డి, ఏపీ అథ్లెటిక్ అసోసియేషన్ పతాకాన్ని శాప్ ఛైర్మన్ రవినాయుడు, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ భరణి ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక, లక్షద్వీప్, పుదుచ్చేరి, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు.

నల్లబర్లీ పొగాకు కొనుగోళ్ల పరిమితి పెంచాలి

● అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు విజ్ఞప్తి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో నల్లబర్లీ పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అసెంబ్లీలో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రశ్నోత్తరాల సమయంలో ప్రస్తావించారు. జిల్లాలో రైతులు మొత్తం 11 వేల టన్నుల పొగాకును పండించారని ప్రభుత్వ అంచనాగా ఉన్నట్టు ఆయన చెప్పారు. జిల్లాలో రైతుల వద్ద నుంచి తొలుత 1,600 టన్నులు, తర్వాత రైతుల ఒత్తిడితో మరో 500 టన్నులు మాత్రమే కొనుగోలు చేశారని, ఇప్పటివరకు కేవలం 2,100 టన్నులు పొగాకును మాత్రమే కొనుగోలు చేసినట్టు తెలిపారు. నెలలు గడుస్తున్నా 20 క్వింటాళ్ల పైబడి పొగాకును పండించిన రైతుల వద్ద నుంచి పొగాకును కొనుగోలు చేయలేదని, కొనుగోళ్ల స్లిప్పులు కూడా ఇవ్వలేదని ఆయన వివరించారు. జిల్లా పరిధిలో కనీసం మరో 2 వేల టన్నుల పొగాకును కొంటే తప్ప రైతులకు ఉపశమనం కలగదని అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం నిబంధనలు సడలించి తక్షణమే పొగాకు కొనుగోళ్లు జరపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యపై గతంలోనే తాము రైతుల పక్షాన మార్క్ ఫెడ్, వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించడం జరిగిందన్నారు. తమకు పరిమితికి మించి కొనుగోళ్లకు సంబంధించి ప్రభుత్వం నుంచి సరైన మార్గదర్శకాలు లేవని, పరిమితి పెంపు ఉత్తర్వులు లేవని అధికారులు చెప్పినట్టు ప్రత్తిపాటి సభద్వారా ప్రభుత్వానికి తెలియచేశారు.

వైసీపీ హయాంలో 28 శాతమే పూర్తి

● కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత 52 శాతం పూర్తి చేశాం
● పిడుగురాళ్ల మెడికల్ కాలేజీపై అసెంబ్లీలో ఎమ్మెల్యే యరపతినేని



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : పిడుగురాళ్ల మెడికల్ కాలేజీ నిర్మాణం విషయం లో వైసీపీ అసత్య, గ్లోబల్ ప్రచారం చేస్తుందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. మెడికల్ కాలేజీల నిర్మాణ అంశంపై మంగళవారం శాసన సభలో జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. వైసీపీ ప్రభుత్వం పిడుగురాళ్ల మెడికల్ కాలేజీని కేవలం 28 శాతమే పూర్తి చేసిందని అన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రావటానికి కొద్ది రోజుల ముందు పనులు పూర్తి కాని మెడికల్ కాలేజీని ప్రారంభించేందుకు శిలాఫలకం ఏర్పాటు చేశారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల్లో 52 శాతం పనులు పూర్తి చేయించామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం కేవలం కేంద్రం నుంచి వచ్చిన నిధులను మాత్రమే మెడికల్ కాలేజీల నిర్మాణానికి వినియోగించారు తప్ప, రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా వెచ్చించిన దాఖలాలు లేవని అన్నారు. ప్రభుత్వం త్వరితగతిన మెడికల్ కాలేజ్ నిర్మాణం పూర్తి చేస్తే పల్నాడు ప్రాంత ప్రజల వైద్య అవసరాలు చాలా వరకు తీరతాయని అన్నారు. గురజాల నియోజకవర్గం కొన్ని మండ లాల్లో వైరల్ జ్వరాలు ఎక్కువగా ఉన్నట్లు పత్రికల్లో వార్తలు వస్తున్నాయని మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కోరారు. గురజాల ఆసుపత్రిలో గైనకాలజిస్టు పోస్టు ఖాళీగా ఉందని, దాన్ని వెంటనే భర్తీ చేయాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అసెంబ్లీ లో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రిటైనింగ్‌వాల్‌కు.. టెండర్లు



రక్షణగోడ లేకపోవడంతో వరదలకు ముంపునకు గురవుతున్న తాడేపల్లి మహానాడు ప్రాంతం (ఫైల్)

వర్షాలు.. వరదలతో.. కృష్ణమ్మ ఎక్కడ తమను ముంచేస్తుందోనని కరకట్ట ప్రాంతవాసులు రాత్రి పగలు అన్న తేడా లేకుండా భయంభయంగా గడుపుతుంటారు. వరద వస్తే రోజుల తరబడి ఇళ్లను వదిలేసి సురక్షిత ప్రాంతాలకు తరలి పోతుంటారు. ఇక ఇలాంటి భయాలు.. కష్టాలు వీడేలా కృష్ణానదిపై ప్రకాశం బ్యారేజీ దిగువున కుడి కరకట్టకు రిటైనింగ్‌వాల్ నిర్మాణ పనులకు మోక్షం కలిగింది. మూడున్నర దశాబ్దాల నుంచి తాడేపల్లి మహానాడు ఏరియా వాసుల వరదముంపు సమస్యకు విముక్తి లభించేలా మంత్రి నారా లోకేశ్ శాశ్వత పరిష్కారాన్ని చూపారు. సీతానగరం రైల్వేవంతెన నుంచి కనకదుర్గా వారధి వరకు సుమారు 1.7 కిలోమీటర్ల పొడవున నదీతీరం వెంబడి కాంక్రీట్ రిటైనింగ్‌వాల్ నిర్మాణానికి రూ.245.18 కోట్లతో జలవనరులశాఖ టెండర్లను ఆహ్వానించింది. కాంట్రాక్టు సంస్థలు వచ్చే నెల 6న ఉదయం పది గంటలలోగా బిడ్లు దాఖలు చేసుకోవచ్చని జలవనరుల శాఖ తెలిపింది. అక్టోబరు చివరికి కాంట్రాక్టు సంస్థకు వర్క్ ఆర్డర్ లభించవచ్చు. నవంబరు లేదా డిసెంబరులో పనులు మొదలై 2027 చివరికి పూర్తయ్యే అవకాశం ఉంది.

(మంగళగిరి, ఆంధ్రజ్యోతి)

కృష్ణానదికి వరదలు వస్తే ప్రకాశం బ్యారేజి దిగువన కరకట్ట వెంబడి పేదల నివాసాలు ముంపనకు గురికావడం పరిపాటిగా మారింది. ఈ సమస్య నుంచి విజయవాడ వైపున్న ప్రాంతాలు కొద్దికాలం కిందటే విముక్తి చెందాయి. అయితే ఇటు గుంటూరుజిల్లా వైపు కుడికట్ట వైపున్న తాడేపల్లి మహానాడు ప్రాంతవాసుల కష్టాలు మాత్రం తీరలేదు. గతేడాది నదికి గరిష్ఠస్థాయిలో 11.45 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చినప్పటికీ విజయవాడ వైపున్న పేదల నివాసాలకు రక్షణగోడ ఏర్పాటు కారణంగా ఎలాంటి సమస్య రాలేదు. కానీ ఇటువైపు తీరంలో ఉన్న మహానాడు మాత్రం వరదముంపునకు గురై వారం రోజులకు పైగా పేదలు ఇబ్బంది పడ్డారు. ఈ పరిస్థితిని స్వయంగా గమనించిన మంత్రి లోకేశ్ రక్షణగోడను నిర్మించాలని గత ఏడాది సెప్టెంబరులో నిర్ణయించారు. నిర్ణయం తీసుకున్న వెంటనే కార్యాచరణ చేపట్టారు. దీంతో జలవనరుల శాఖ రూ.294.20 కోట్ల అంచనాలతో రూపొందించిన ప్రతిపాదనలను జనవరిలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆమోదింపజేసి దానికి సంబంధించిన పరిపాలన అనుమతులకు లోకేశ్ గ్రీన్‌సిగ్నల్‌ను ఇప్పించారు.



రూ.245 కోట్లతో కుడికట్ట పనులు
దిగువ కృష్ణలో 1.71 కిమీ పొడవునా రక్షణ గోడ
మంత్రి లోకేశ్ కృషితో తీరనున్న పేదల కడగండ్లు

పేదల గోడు పట్టించుకోని వైసీపీ

2019-24 మధ్య అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వ హయాంలోనే తాడేపల్లి మహానాడు వైపు కృష్ణాతీరం వెంబడి రిటైనింగ్‌వాల్‌ను నిర్మించాలనే డిమాండ్లు బలంగా వచ్చాయి. విజయవాడ వైపు రక్షణగోడ నిర్మాణం చేపడుతున్నట్లే తమవైపు కూడ ఆ పనులను జరిపించి తమను రక్షించాలని మహానాడు, సుందరయ్యకట్టవాసులు కోరారు. అయితే వీరిగోడును పట్టించుకోలేదు.



విజయవాడ బాలాజీనగర్ వైపు గతంలో నిర్మించిన కృష్ణానది ఎడమవైపు రక్షణగోడ

రోడ్డును వదిలేయడంతో తగ్గిన వ్యయం

బ్యారేజి దిగువన కుడిమార్జిన్ వెంబడి 0.9 కిలోమీటర్ల నుంచి అంటే సీతానగరం రైల్వేవంతెనల నుంచి 2.61కిలోమీటర్ల వరకు అంటే వారధి వరకు సుమారు 1.71కిలోమీటర్ల పొడవున కాంక్రీట్ రిటైనింగ్‌వాల్‌ను నిర్మించేందుకు జలవనరులశాఖ రూ.245.18 కోట్లతో ప్రతిపాదనలను సిద్ధం చేసింది. అయితే మంత్రిమండలి రూ.294.20 కోట్లకు పరిపాలనా అనుమతులను మంజూరు చేసింది. ఫైనల్ టెండరుకు వచ్చేప్పటికి అంచనా వ్యయం రూ.245.18 కోట్లుగా జలవనరులశాఖ తేల్చింది. తొలుత విజయవాడ బాలాజీనగర్ వైపు నిర్మించిన విధంగా రివర్ ఫ్రంట్ పార్కుతో కూడిన రిటైనింగ్‌వాల్ తోపాటు ఆ పక్కనే 60 అడుగుల సిమెంటు రోడ్డును నిర్మించాలని ప్రతిపాదించారు. కానీ సదరు సిమెంటు రోడ్డు నిర్మాణం వల్ల భవిష్యత్తులో రిటైనింగ్‌వాల్ బలహీనమవుతుందన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీంతో సిమెంటు రోడ్డు నిర్మాణాన్ని వదిలేసి కేవలం రిటైనింగ్‌వాల్, రివర్ ఫ్రంట్ పార్కును మాత్రమే చేపట్టాలని నిర్ణయించారు. దీంతో అంచనా వ్యయం రూ.294.20 కోట్ల నుంచి రూ.245.18 కోట్లకు తగ్గింది.

రిటైనింగ్‌వాల్ అంటే సాదాసీదా కాంక్రీట్‌వాల్ కాదు. 2.2 మీటర్ల వెడల్పుతో బలిష్టంగా నిర్మించనున్నారు. నదికి 12 లక్షల క్యూసెక్కులకు పైగా వరద వచ్చినా చెక్కు చెదరకుండా బలంగా నిలిచి ఉండేలా అత్యంత బలిష్టంగా నిర్మిస్తారు. రిటైనింగ్ వాల్ ప్రకాశం ఆనకట్టతో సమానంగా వరదపోటును సమర్థంగా ఎదుర్కొనేలా నిర్మించనున్నారు.

..బాహుబలి గోడ

వృద్ధులకు.. వరం

● ప్రయోజనకరంగా సీనియర్ సిటిజన్ కార్డులు ● ప్రచార లోపంతో అందుకోలేక పోతున్న వృద్ధులు


వినుకొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను సులువుగా పొందేలా.. వృద్ధాశ్రమంలో సేవలు అందుకునేలా.. వృద్ధులకు వరంలా.. రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ సిటిజన్ కార్డులను ప్రవేశపెట్టింది. అనేకరకాల ప్రయోజనాలు ఉన్న కార్డులను గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉచితంగా జారీ చేస్తున్నారు. అయితే ప్రచార లోపం వల్ల వృద్ధులకు ఈ కార్డుల గురించి తెలియడం లేదు.

కార్డు ఇలా పొందవచ్చు...

పురుషులకు 60, మహిళలకు 58 ఏళ్లు నిండితే సీనియర్ సిటిజన్ కార్డులను ప్రభుత్వం మంజూరు చేస్తుంది. గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసిన వారికి వారంలో కార్డు మంజూరవుతుంది. జిల్లా దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుల కార్యాలయంలో వెంటనే పొందవచ్చు. దరఖాస్తుతో పాటు పాస్‌పోర్ట్ సైజు ఫొటో, వయస్సు ధ్రువీకరణకు ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా పత్రాలు ఇవ్వాల్సి ఉంటుంది. పల్నాడు జిల్లాలో 1.92 లక్షల మంది వృద్ధులకు ఇప్పటివరకు 12290 కార్డులు మాత్రమే మంజూరయ్యాయి.

ప్రయోజనాలు ఇలా..

- సీనియర్ సిటిజన్ కార్డుతో ఆర్టీసీ బస్సుల్లో టిక్కెట్‌లో 25 శాతం రాయితీ.
- దగ్గర ప్రాంతాల్లో తిరిగే బస్సుల్లో 2 రిజర్వ్ సీట్లు
- రైళ్లల్లో లోయర్ బెర్త్‌ల ఎంపికకు ప్రాధాన్యం.



సీనియర్ సిటిజన్ కార్డు

- స్లీపర్ కోచ్‌లో 6, థర్డ్ ఏసీలో 4, సెకండ్ ఏసీలో 3 బెర్త్‌లు రిజర్వ్ చేసుకోవచ్చు.
- నూతన పాస్‌పోర్ట్ కోసం స్లాట్ బుకింగ్ ఫీజులో 10 శాతం రాయితీ.
- ప్రత్యేక క్యూ ద్వారా బ్యాంకుల్లో సేవలు పొందవచ్చు.
- బ్యాంకుల్లో డిపాజిట్లపై అదనపు వడ్డీ లభిస్తుంది.
- ఇన్‌కమ్‌ట్యాక్స్‌లోమినహాయింపు పొందవచ్చు.
- న్యాయస్థానాల్లో కేసుల విచారణ ప్రత్యేక ప్రాధాన్యం. సీనియర్ సిటిజన్స్ లేఖ రాసినా, లేదా వారి తరపున న్యాయవాది కోరినా ప్రత్యేక విచారణ తేదీలు కేటాయిస్తారు.ఆయా ప్రయోజనాలను దేశవ్యాప్తంగా ఎక్కడైనా నిరాటంకంగా పొందవచ్చు.

గంజాయి కేసులో ఐదుగురి అరెస్టు

● నిందితుల్లో వైసీపీ సోషల్ మీడియా నేత



కుంచాల సవీంద్రారెడ్డి (ఫైల్)

గుంటూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో వైసీపీ సోషల్ మీడియా నేత కుంచాల సవీంద్రారెడ్డితో పాటు మరో నలుగురుని అరెస్టు చేసినట్లు ప్రత్తిపాడు పోలీసులు మంగళవారం తెలిపారు. సవీంద్రారెడ్డి వద్ద కిలోన్నర గంజాయి, చిన్నకోండ్రుపాడుకి చెందిన బత్తుల దీవెనబాబు, వెంకటేశ్వర్లు, నాగేంద్ర, యనమదలకు చెందిన సారధి వద్ద కిలో 250 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చిన్నకోండ్రుపాడు పొలాల్లో గంజాయి వినియోగంపై అందిన సమాచారంతో సోమవారం పోలీసులు దాడి చేశారు. గంజాయితో ఉన్న బత్తుల దీవెనబాబుతో పాటు గంజాయి తాగుతున్న వెంకటేశ్వర్లు, సారధి, నాగేంద్ర పోలీసులకు పట్టుబడ్డారు. వారిని విచారించగా చిలకలూరిపేటకు చెందిన జస్వంత్, తాడేపల్లి పరిధిలోని ప్రాతూరు వద్ద కారులో గంజాయి విక్రయించే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు దీవెనబాబు పోలీసులకు చెప్పాడు. దీంతో పోలీసులు ప్రాతూరు వద్దకు వెళ్లగా ఓ కారులోని సవీంద్రారెడ్డిని దీవెనబాబు గుర్తించడంతో అతడ్ని అదుపులోకి తీసుకున్నారు. కారులో కిలోన్నర గంజాయిని స్వాధీనం చేసుకుని సవీంద్రారెడ్డిని ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గానికి చెందిన కుంచాల సవీంద్రారెడ్డి కొద్ది సంవత్సరాలుగా తాడేపల్లిలో నివాసం ఉంటూ బైపాస్ రోడ్డులో హోటల్ డి దేవ్ వద్ద భార్యతో కలిసి చెరుకు రసం స్టాల్ నిర్వహిస్తున్నాడు. చెరుకు రసం స్టాల్ ముసుగులో సవీంద్రారెడ్డి గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులు అంటున్నారు.

హైకోర్టులో సవీంద్రారెడ్డి భార్య పిటిషన్

తన భర్తను కారులో వచ్చిన కొందరు గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసి తీసుకెళ్లారని, ప్రశ్నిస్తే పోలీసులమని చెప్పారంటూ సవీంద్రారెడ్డి భార్య హైకోర్టులో మంగళవారం హెబియస్‌కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే సవీంద్రారెడ్డి విషయం తెలియని పీపీ పోలీసులు అదుపులోకి తీసుకోలేదని హైకోర్టుకు తెలిపారు. సవీంద్రారెడ్డిని బుధవారం ప్రత్తిపాడు పోలీసులు హైకోర్టులో హాజరుపరచనున్నారు. కాగా బత్తుల దీవెన బాబును కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్ విధించడంతో ఆయనను జిల్లా జైలుకు తరలించారు. ఇదే కేసులో వెంకటేశ్వర్లు, సారధి, నాగేంద్రలను పోలీసులుస్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



ల్యాబ్ నిర్వాహకులతో మాట్లాడుతున్న డాక్టర్ అన్నపూర్ణ

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరమైన చర్యలు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఉప వైద్యాధికారి అన్నపూర్ణ చెప్పారు. పాత ప్రభుత్వ వైద్యశాలలోని కార్యాలయంలో మంగళవారం డివిజన్‌లోని ప్రైవేట్ ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్లు, ల్యాబొరేటరీల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని వివరించారు. మొదటి నిబంధన ఉల్లంఘిస్తే మూడేళ్ల జైలు, రూ.50 వేల జరిమానా, ధ్రువీకరణ పత్రం రద్దు చేయడం జరుగుతుందన్నారు. రెండోసారి లింగ నిర్ధారణ చేసినట్లయితే ఐదేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా ధ్రువీకరణ పత్రం శాశ్వత రద్దు చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నరేంద్రసింగ్, డాక్టర్ సురేష్, డాక్టర్ వినీల, డాక్టర్ ప్రియాంక, రెడ్‌క్రాస్ కార్యదర్శి భానుమతి, శ్రీమన్నారాయణ, పెనుగొండ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పరిశ్రమల చట్టం సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలి

తెనాలి అర్బన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమల చట్టం, దుకాణాల చట్టం బిల్లుల సవరణలను వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.బాబుప్రసాద్ డిమాండ్ చేశారు. శాసన సభలో ఈ బిల్లుల సవరణలను వ్యతిరేకిస్తూ మంగళవారం మారీసుపేటలోని కార్మిక శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తుందని, పని గంటలు పెంచేందుకు ప్రయత్నిస్తుందని మండిపడ్డారు. రాత్రి పని వేళలను మహిళ కార్మికులకు నిషేధం ఉన్నా రద్దు చేస్తున్నారని, కార్మిక సంఘాలను సంప్రదించకుండా ఏకపక్షంగా పాలిస్తే పతనం తప్పదని హెచ్చరించారు. షేక్ హుస్సేన్‌వలి, రవికుమార్, వెంకటసుబ్బయ్య, వెంకటేశ్వర్లు, రత్నకుమారి, లక్ష్మీ, సుగుణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కార్మిక శాఖ అధికారి ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు.

పట్టణంలో ఉచిత వైద్య శిబిరాలు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని గంగానమ్మపేట, సుల్తానాబాద్‌లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కౌన్సిలర్లు తాడిబోయిన బ్రహ్మేశ్వరరావు, పి.విజయలక్ష్మి శిబిరాలను ప్రారంభించారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ మొవ్వా యేసుబాబు మాట్లాడుతూ, మహిళల ఆరోగ్యానికి కేంద్ర ప్రభుత్వం స్వస్థ్‌నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం చేపట్టిందన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్య సమస్యలపై అవగాహనతో ఉండాలని, ప్రతి మహిళ చైతన్యవంతమైతే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాహుల్, నిహారిక, డాక్టర్ సుబ్బలక్ష్మి, ప్రియాంక, సుజాత, వైద్యసేవలు అందించారు. డిప్యూటీ డిఎంహెచ్‌వో అన్నపూర్ణ పర్యవేక్షించారు.



శిబిరాన్ని ప్రారంభిస్తున్న కౌన్సిలర్ బ్రహ్మేశ్వరరావు

మున్సిపల్ పాఠశాలకు వంట గది నిర్మాణం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రామలింగేశ్వరపేటలోని మున్సిపల్ పాఠశాలకు రోటరీ క్లబ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో నిర్మించిన వంట గదిని మంగళవారం ప్రారంభించారు. రూ.50 వేలు వెచ్చించి ఈ సౌకర్యం కల్పించారు. క్లబ్ అధ్యక్షుడు నల్లూరు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, పాఠశాలలో వంట గది లేకపోవడం వలన కలుగుతున్న ఇబ్బందులను తమ దృష్టికి తెచ్చారని, దీంతో పాటు అంగన్‌వాడీ కేంద్రానికి స్టోర్ రూమ్‌ను కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఈదర వెంకటపూర్ణచంద్, జీవీ నారాయణ, హరిప్రసాద్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కొడాలి సౌజన్య, గుత్తా వెంకటరత్నం, బత్తుల వెంకటేశ్వరరావు, కన్నెగంటి మురళీకృష్ణ పాల్గొన్నారు.



వంట గది ప్రారంభిస్తున్న క్లబ్ సభ్యులు

కళారంగంపై యువతను ప్రోత్సహించడం అభినందనీయం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కళారంగంపై యువతను ప్రోత్సహించడం అభినందనీయమని సాహిత్యవేత్త టీవీఎస్ శాస్త్రి అన్నారు. ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు ఆదినారాయణరావును దసరా ఉత్సవాలలో ఘనంగా సన్మానించారు. ఆయన శిక్షణ ఇచ్చిన యువ కళాకారులు గయోపాఖ్యానం, రామాంజనేయ యుద్ధం, నాటికల్లో ఘట్టాలను అద్భుతంగా ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ, రంగస్థలం అంతరిస్తున్న తరుణంలో కళారంగాన్ని ప్రోత్సహించేందుకు యువకుల్లో కళల పట్ల ఆసక్తి పెంపొందించి శిక్షణ ఇవ్వడం ఈ రంగానికి ఊపిరి పోయడమేనన్నారు. ఈ కార్యక్రమంలో ఫణికుమార్, నాగరాజు, శ్రీనివాసరావు, కుమార్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో ముగ్గురి అరెస్టు

● మిస్టరీ వీడిన పెదకాకాని యువకుడి హత్య కేసు

యడ్లపాడు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్నేహితులే కాలయములుగా మారి పెదకాకానికి చెందిన తాడిబోయిన గోపి(32)ని హత్య చేసిన కేసులో ముగ్గుర్ని అరెస్టు చేసినట్లు నరసరావుపేట డీఎస్పీ ఎం.హనుమంతరావు తెలిపారు. చిలకలూరిపేట రూరల్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం నిందితులను మీడియా ఎదుట హాజరుపరిచి వివరాలు తెలిపారు. ఈ ఏడాది జూన్ 25న యడ్లపాడు నక్కవాగు సమీపంలో జాతీయరహదారి సర్వీసు రోడ్డు పక్కన కాల్వలో గుర్తుపట్టలేనట్లు కాలిపోయిన మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా మృతుడు గుంటూరు జిల్లా పెదకాకానికి చెందిన తాడిబోయిన గోపి(32)గా గుర్తించారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీరైన గోపి హత్యకు ముందు వరకు సిలిస్టియాన్ క్రియేషన్స్ బ్యానర్ పేరుతో మిషన్ మంగళాద్రి అనే వెబ్ సిరీస్ తీస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ క్రమంలో గుంటూరులో క్యాటరింగ్ సర్వెంట్‌గా పనిచేసే ఆఫ్రిన్‌తో గోపి సన్నిహితంగా ఉండేవాడు. ఆమె తమ్ముడు ఇమ్రాన్‌తో కూడా గోపికి పరిచయం ఏర్పడింది. అయితే ఆఫ్రిన్‌తో సన్నిహితంగా ఉండే గోపి ఇమ్రాన్ ప్రేమించిన యువతిని వేధిస్తున్నాడు. దీంతో వారి మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. ఈ కారణంతో గోపిని హతమార్చి అతడి వద్ద నగదు కాజేయాలని ఇమ్రాన్ పథకం వేశాడు. అందుకు తన స్నేహితులైన షేక్ రియాజ్, ఖాజమొహినుద్దీన్‌ల సహాయం కోరాడు. దీంతో జూన్ 24న ఫోన్‌చేసి గోపిని తాను అద్దెకు ఉంటున్న గదికి ఇమ్రాన్ రప్పించాడు. గదికి వచ్చిన గోపిని స్నేహితులతో కలిసి రాడ్‌తో కొట్టి మెడకు తాడు బిగించి హత్య చేశారు. అనంతరం మృతదేహాన్ని కారులో తీసుకువచ్చి 25న తెల్లవారుజామున యడ్లపాడు వద్ద కాల్వలో పడేసి పెట్రోల్‌తో నిప్పంటించి వెళ్లిపోయారు. సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించిన పోలీసులు ముగ్గుర్ని సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచిహత్యకు వినియోగించిన రాడ్, గోపికి చెందిన ఫోన్, ఏటీఎం కార్డు, 12 వేల నగదు, నిందితులు ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను చిలకలూరిపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరచగా న్యాయాధికారి 15 రోజులు రిమాండ్ విధించినట్లు డీఎస్పీ తెలిపారు.

వైభవంగా దసరా ఉత్సవాలు

● అమ్మవార్లకు గాయత్రిదేవి, కాత్యాయని అలంకారాలు



శ్రీవిద్యా పీఠంలో పూజలు చేస్తున్న బాలస్వామి



మారీసుపేటలో కాత్యాయని అలంకారం



గాయత్రి అలంకారంలో వాసవీ అమ్మవారు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆలయాలలో దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. పలు ఆలయాలలో అమ్మవారిని మంగళవారం గాయత్రిదేవిగా, కాత్యాయనిదేవిగా అలంకరించి పూజలు చేశారు. బోసు రోడ్డులోని శ్రీవాసవీ ఆలయంలో 12 మంది దంపతులు ఉభయ దాతలుగా పూజలు చేయించారు. వాసవీ అమ్మవారి చరిత్ర, బుర్రకథను కథాగానసుధ నాగమణి గానం చేశారు. మారీసుపేట శివాలయంలో 8 మంది ఉభయ దాతల దంపతులు పూజలు జరిపారు. గానకోకిల ఎ.హిమబిందు బృందం ఆలపించిన శాస్త్రీయ భక్తిరంజని భక్తులను అలరించింది. దేవీచౌక్‌లోని శ్రీరాజరాజేశ్వరి ఆలయంలో భక్తులు పూజలు, అలంకారాలు చేయించారు. శ్రీలాస్య కూచిపూడి నాట్యాలయం ఆధ్వర్యంలో కూచిపూడి, జానపద నృత్యాలతో అలరించారు. రామలింగేశ్వరపేట రామలింగేశ్వరస్వామి ఆలయంలో హరినామ సంకీర్తన బృందం సంగీత విభావరి నిర్వహించారు. సాయం సమయంలో అమ్మవారికి వివిధ హారతులతో ద్వార దర్శనం చేశారు. నందులపేట శ్రీషిరిడిసాయి అనుగ్రహ పీఠంలో చండీ పారాయణ, సౌందర్యలహరి పారాయణ, లలిత సహస్రనామ పారాయణ నిర్వహించారు. గంగానమ్మపేట శ్రీవిద్యా పీఠంలో బాలస్వామి అమ్మవారికి పూజలు చేశారు. లలిత సహస్ర పారాయణ, లక్ష్మీస్తోత్రం, వాసవీ సిస్టర్స్ భక్తి కీర్తనలు నిర్వహించారు. రూరల్ మండలం అంగలకుదురులో అరవ బాజీ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్గామాత పూజల్లో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. నందివెలుగు అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. సుల్తానాబాద్, చినరావూరు, శివాజీచౌక్ కాళీమాత, పాత శివాలయం, బాలత్రిపురసుందరి ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు గావించి పూజ కార్యక్రమాలు నిర్వహించారు.



అంగలకుదురులో దుర్గమ్మ పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్

గాయత్రీ దేవిగా అలరించిన అమ్మవారు

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా రెండవ రోజు మంగళవారం అమ్మవారు గాయత్రీ దేవిగా భక్తులను అలరించింది. పట్టణంలోని జీబీసీ రోడ్డులో ఉన్న కనకదుర్గ భవాని ఆలయంలో కొలువుదీరిన అమ్మవారికి రెండవ రోజు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు సామూహిక కుంకుమార్చన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సాక్షి భావనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలోని విశాలక్షమ్మ పంచముఖ గాయత్రీ దేవిగా భక్తుల పూజలు అందుకుంది. అలాగే వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు శ్రీ సహస్రలింగేశ్వర స్వామి ఆలయంలోని పార్వతి దేవిగా, నిడుబ్రోలు చౌడేశ్వరాలయంలోని రాజరాజేశ్వరి దేవిగా, చింతలపూడి భ్రమరాంబ దేవిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ములుకుదురు, చింతలపూడి, మాచవరం, పచ్చలతాడిపర్రు, తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన నవరాత్రి మండపాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. పట్టణంలోని సాయి నగర్ శ్రీ షిర్డి సాయి మందిరంలో సాయిబాబా పుణ్యతిధి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల సందర్భంగా సాయిబాబాకు పంచామృత అభిషేకాలను నిర్వహించారు.



బ్రహ్మచారిని అలంకారంలో దర్శనమిస్తున్న కనకదుర్గ భవాని

గరువుపాలెం గ్రామంలో ....

చేబ్రోలు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చేబ్రోలు మండలం గరువుపాలెం గ్రామంలో ప్రతిష్ఠాత్మకంగా 30వ దేవి శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. దుర్గాభవాని యూత్ ఆధ్వర్యంలో విద్యుత్ అలంకరణలతో సుందరమైన మండపాలతో దుర్గాదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అమ్మవారు రెండోరోజు గాయత్రీ దేవి అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. దేవిశరన్నవరాత్రి వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సౌభాగ్య లక్ష్మి అమ్మవారిగా మహాలక్ష్మి అమ్మవారు

పెదకాకాని, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట గల శ్రీ దశావతార వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో ఉన్న శ్రీ మహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో రెండో రోజు మంగళవారం అమ్మవారు సౌభాగ్య లక్ష్మి అలంకారంతో భక్తులకు దర్శనం ఇచ్చారు. నిత్యం ఆలయంలో జరిగే భక్తి కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి అనుగ్రహం పొందాలని ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణ భాస్కరరావు దంపతులు భక్తులకు తెలియజేశారు.



సౌభాగ్య లక్ష్మి అలంకారంలో మహాలక్ష్మి అమ్మవారు

కొల్లిపరలో...

కొల్లిపర, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు మండలంలో భక్తి ప్రపత్తులతో నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉత్సవాల్లో భాగంగా పలు చోట్ల అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించారు. దీంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. కొల్లిపర శ్రీదేవి భూదేవి సమేత శ్రీ జనార్ధన స్వామి దేవస్థానంలో శ్రీసర్వమంగళ పార్వతీదేవి, శ్రీ షిర్డీసాయిబాబా మందిరంలో శ్రీమంగళగౌరిదేవి, ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శ్రీగాయత్రిదేవిగా అమ్మవారిని పండితులు అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పరిధిలో తూములూరు, హనుమాన్‌పాలెం, అన్నవరం, దావులూరు, చక్రాయపాలెం, మున్నంగి, అత్తోట గ్రామాల్లోని శివాలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించటంతో భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించారు.



కొల్లిపర ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శ్రీగాయత్రిదేవి

పెదకాకానిలో లైటింగ్ కటౌట్ల దొంగతనం

● సీఐకి ఫిర్యాదు చేసిన దేవస్థాన ఉద్యోగి



సీఐ నారాయణస్వామికి ఫిర్యాదు చేస్తున్న దేవస్థాన ఉద్యోగి బసవ శంకర్

పెదకాకాని, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో దసరా ఉత్సవాల సందర్భంగా పెదకాకాని ఆర్చి సెంటర్ వద్ద, ఆలయ ఆర్చి గేటు వద్ద విద్యుత్ దీపాలంకరణతో ఏర్పాటు చేసిన అమ్మవారి లైటింగ్ కటౌట్లను దొంగిలించినట్లు దేవస్థాన ఉద్యోగి బసవ శంకర్ మంగళవారం పెదకాకాని సీఐ నారాయణ స్వామికి ఫిర్యాదు చేశారు. టెండర్ పొందిన కాంట్రాక్టర్ టెండర్ దారులు ఈనెల 22 రాత్రి సుమారు 11:00 గంటల సమయంలో లైటింగ్ కటౌట్ స్టాండ్లను ఏర్పాటు చేశారని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ దీపాలకు సంబంధించిన కటౌట్ స్టాండ్స్ తొలగించి, విద్యుత్ వైర్లు దొంగిలించినట్లు ఫిర్యాదు చేశారు.



వడ్డీముక్కల గ్రామంలో మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

గ్రామ స్థాయిలో బీజేపీ బలోపేతం

● జిల్లా కార్యదర్శి కలపాల

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : గ్రామస్థాయిలో భారతీయ జనతా పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కలపాల శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిధిలోని వడ్డీముక్కల గ్రామంలో సేవా పక్వాడ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతను స్థానికులకు అప్పగించారు. గ్రామంలో రహదారుల వెంట ఉన్న పిచ్చి చెట్ల తొలగింపు కార్యక్రమాన్ని శ్రమదానం ద్వారా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వడ్రానం ఉదయ్ చంద్రరావు, నాయకులు గురుబాబు, గుడివాడ పవన్, ఆకాష్, గణేష్, సిహెచ్ సతీష్, పాల్గొన్నారు.

అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలి

చేబ్రోలు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చేబ్రోలు మండలం శేకూరు గ్రామంలో సీఐటీయూ సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ కమిటీకి సుజాత అధ్యక్షత వహించగా ఈ సమావేశంలో సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్కీం వర్కర్లకు పెరుగుతున్న ధరలకు సమానంగా వేతనాలు పెంచాలని కోరారు. పని గంటలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను కార్మిక వర్గం ఐక్య పోరాటాల ద్వారా తిప్పికొట్టగలమని అన్నారు. డిసెంబర్‌లో జరగబోయే అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని కార్మిక వర్గాలకు పిలుపునిచ్చారు. అనంతరం నూతన కన్వీనింగ్ కమిటీ ఏర్పాటు చేశారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన ఉత్పత్తులు

కొల్లిపర, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయం ద్వారా నాణ్యమైన ఉత్పత్తులు సాధించటానికి అవకాశం ఉందని ఐసీఆర్‌పీ షేక్ మస్తాన్‌బీ అన్నారు. మండల పరిధిలోని మున్నంగిలో ప్రకృతి వ్యవసాయాధికారులు ప్రకృతి వ్యవసాయ సాగు విధానంపై మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. బీజామృతం తయారు చేసే విధానాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా మస్తాన్‌బీ మాట్లాడుతూ మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ప్రతి కుటుంబం కూడా కావలసిన ఆకుకూరలు, కూరగాయలను పెరటిలో పండించుకుని తింటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

రెక్టార్ శివరాం ప్రసాద్‌కు దినసరి ఉద్యోగుల అభినందనలు

ఏఎన్‌యూ సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి నూతనంగా తాత్కాలిక రెక్టర్‌గా నియమితులైన ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్‌కు దినసరి ఉద్యోగుల సంఘం మంగళవారం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శివరాం ప్రసాద్ మాట్లాడుతూ వర్సిటీ దినసరి ఉద్యోగుల సమస్యలపై సహాయ సహకారాలు అందిస్తామన్నారు. వర్సిటీలో ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో దినసరి ఉద్యోగుల సంఘం రత్తయ్య, ఎన్ రమేష్, డాక్టర్ వి. శ్రీనివాస్, రాజు, టి. రవి, వెంకటేశ్వర్లు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



రెక్టార్ శివరాం ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దినసరి ఉద్యోగ సంఘం నేతలు

వీధి వ్యాపారుల స్థితిగతులు మార్చేందుకే కేంద్ర పథకం

● మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి

తెనాలి అర్బన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : వీధి వ్యాపారుల స్థితిగతులు మార్చేందుకే కేంద్ర ప్రభుత్వం పీఎం స్ట్రీట్ వెండర్స్ ఆత్మనిర్భర్ పథకం ప్రవేశపెట్టిందని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం లోక్ కళ్యాణ్ మేళా నిర్వహించారు. ఈ పథకం కింద పేదలు రుణాలు తీసుకుని ఆర్థిక కార్యకలాపాలకు వినియోగించి కుటుంబ ఆర్థిక స్థితిగతులను మెరుగు పరుచుకుంటున్నారని చెప్పారు. రుణాలు తీసుకునే వారికి బ్యాంకులు సిబిల్ స్కోర్ చూస్తాయని, ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలను ఆశ్రయిస్తే సిబిల్ తగ్గుతుందన్నారు. ఈ పథకంలో రుణం పొంది సద్వినియోగం చేసుకుంటున్నట్లు పలువురు లబ్ధిదారులు చెప్పారు. తొలి, రెండో విడత రుణాలు తీసుకుని చెల్లించిన వారికి మూడో విడత రుణం బ్యాంకులకు ఆదేశాలు రాలేదని చెబుతున్నారని లబ్ధిదారులు వాపోయారు. సంబంధిత బ్యాంకుల వివరాలు తీసుకుని రుణాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. బ్యాంకు మేనేజర్లు బాలగంగాధరరావు, కిషన్, కృష్ణప్రసాద్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగమణి పాల్గొన్నారు.



లోక్ కళ్యాణ్ మేళాలో మాట్లాడుతున్న మెప్మా పీడీ విజయలక్ష్మి

నైపుణ్యాలు సాధించే విద్యార్థులకు మంచి ఉపాధి అవకాశాలు

తెనాలి అర్బన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నైపుణ్యాలు సాధించే విద్యార్థులకు మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని పారిశ్రామిక వేత్త కొత్త సుబ్రహ్మణ్యం తెలిపారు. జగ్గడిగుంటపాలెంలోని ఐటీఐలో మంగళవారం నైపుణ్య శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధి అవకాశాలను అందించే ఐటీఐలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు తగిన సామర్థ్యం లేకుంటే ఇంటర్ ఆపై చదువులకన్నా ఐటీఐలతోనే ఎంతో ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. జూలైలో నిర్వహించిన ట్రేడ్ టెస్టులో 99 శాతం ఉత్తీర్ణత ఉండటం అభినందనీయమన్నారు. టాపర్స్‌గా నిలిచిన ఈశ్వర్, భరత్, వెంకటేశ్వర్లులను అభినందించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆర్.చినవెంకటేశ్వర్లు, పూర్వ విద్యార్థులు ప్రసాద్, జనార్ధనరావు, పద్మావతి, రామాంజనేయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న పారిశ్రామిక వేత్త సుబ్రహ్మణ్యం

వరి పైరులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పొన్నూరుటౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వరి పైరులో పురుగు నివారణ చర్యలు చేపట్టాలని ఏడీఏ వీ.రామకోటేశ్వరి అన్నారు. మండల పరిధిలోని కట్టెంపూడి, పచ్చలతాడిపర్రు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి పైరును పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం వరిపైరులో ఆకు ముడత పురుగు ఉధృత అధికంగా ఉన్నట్లు గుర్తించారు. రైతులకు భూసార పరీక్షల ఫలితాలు విశ్లేషణ పత్రాలను అందజేశామని వాటి ఫలితాల ఆధారంగా రైతులు ఎరువులు వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు సీపీవో కార్యాలయ డీవైఎస్‌వో కే.సుందర్‌రామిరెడ్డి, ఎండీ షబ్బీర్ అహ్మద్ పాల్గొని పంట కోత ప్రయోగాలపై అవగాహన కల్పించారు. వచ్చే నెల 7వ తేదీన సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో భాగంగా ఎలుకల నివారణ మందు పంపించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

చేబ్రోలు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : చేబ్రోలులోని పాత పోలీస్ స్టేషన్ సమీపంలో అంబేద్కర్ బొమ్మ ప్రక్కన ఉన్న బస్సు షెల్టర్‌లో అనుమానాస్పద స్థితిలో ఉన్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు ఏలూరులోని దక్షిణగిరి ప్రాంతానికి చెందిన బి.గోవిందు (70)గా తెలిసింది. ఈనెల 21న ఇంట్లో నుంచి బయటకు వెళ్ళి తిరిగిరాక పోవటంతో అతని మనవడు ఏలూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు అందించిన సమాచారంతో మృతిని బంధువులు చేరుకుని పోస్టుమార్టం అనంతరం స్వగ్రామానికి మృతదేహాన్ని తరలించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ల వినతి

ప్రత్తిపాడు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అస్టెంట్లు ఆ శాఖ డైరెక్టర్‌కు వినతిత్రపం అందజేశారు. గత 17 సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతంలో ఎంతోమందికి ఉపాధికల్పిస్తూ గ్రామ పంచాయతీ అభివృద్ధిలో భాగస్వాములుగా ఉన్న తమకు కనీస వేతనం రూ.20వేలు ఇచ్చేవిధంగా చూడాలని, అంతేకాకుండా అనుభవం కలిగిన వారికి ప్రమోషన్స్ కల్పించాలంటూ పలు డిమాండ్లతో వినతిపత్రం అందజేశారు.

డయేరియాపై అవగాహన కల్పించాలి

● తహసీల్దార్ హేనాప్రియ

పెదనందిపాడు,సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో వైద్య ఆరోగ్య, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది డయేరియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ హేనాప్రియ మంగళవారం పిలుపునిచ్చారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధుల ప్రబలే ప్రమాదం ఉందని వీటిపై అప్రమత్తంగా ఉండాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని వ్యక్తిగత పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

వీడని వర్షంతో రైతుల అవస్థలు

గత నాలుగు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలతో రైతులు అవస్థలు పడుతున్నారు. పంట పొలాల్లో నీరు నిలవడంతో వాటిని బయటకు పంపేందుకు నానా తంటాలు పడుతున్నారు. డ్రైయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వలనే పంటలు నీట మునుగుతున్నాయని దీంతో పంట పూర్తిగా దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కురుస్తున్న వర్షాలకు పల్లపు ప్రాంతాలు మొత్తం జలమయం కాగా రోడ్లపై నీరు నిలిచి అటు వాహనదారులు, ప్రజలు సైతం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధచూపాలి

● వైద్యాధికారి ప్రియంవద

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధచూపాలని వైద్యాధికారి ప్రియంవద అన్నారు. మండల పరిధిలోని అన్నవరంలో మంగళవారం స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ప్రసాదస్వామి, సూపర్‌వైజర్ చెన్నయ్య, జి.శ్రీనివాసరావు, ఆరోగ్యమిత్ర సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట కాలనీని ముంచెత్తిన కొండనీరు

ఫిరంగిపురం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురంలో గత వారం రోజుల నుంచి నిత్యం పడుతున్న భారీ వర్షాల వల్ల కొండ నీరు కొత్తపేట కాలనీని ముంచెత్తింది. నిలువ ఉన్న వర్షపు నీరు మురుగై కాలనీలోనే నిల్వ ఉండటంతో ఈగలు, దోమలు, మురుగుతో వాసన భరించలేక పోతున్నామని స్థానికులు పంచాయతీ అధికారులకు తెలిపారు. దీంతో మంగళవారం స్పందించిన స్థానిక పంచాయతీ అధికారులు జేసీబీతో మురుగుకు మార్గాన్ని ఏర్పాటు చేశారు.

చీడపీడల నుంచి పంటను కాపాడుకోవాలి

దుగ్గిరాల, సెప్టెంబరు 23: మండలంలోని గొడవర్రు, పెదకొండూరు గ్రామాల్లో వరిక్షేత్రాలను వ్యవసాయశాఖాధికారులు మంగళవారం సందర్శించారు. ఏఓ ఆర్. విజయబాబు మాట్లాడుతూ రాత్రివేళల్లో ఉష్ణోగ్రతలు తగ్గుతుండటంతో పొలాల్లో ఆకుచుట్ట పురుగులు, నల్లి వంటి చీడలు అధికంగా కనిపిస్తున్నాయని నివారణకు తయోమిథాగ్జిమ్ ఎకరానికి 150మి.లీ. లేదా అసిఫేట్ 400గ్రాముల పిచికారీ చేయాలని, నల్లి సమస్య అధికంగా ఉంటే ప్రొపాగ్రైట్ ఎకరానికి 250మి.లీ. పిచికారీ చేయాలన్నారు. ఏఈఈ సీహెచ్ ప్రజ్ఞాన్‌బాబు, వీఏఏ సాయికృష్ణ, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఈ పంట నమోదు తప్పనిసరి: ఏవో

పెదనందిపాడు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతులు ఈ- పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో సుబ్రహ్మణ్యం అన్నారు. మండల పరిధిలోని రాజుపాలెం, వరగాని గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తిపంట పూతదశలో ఉందని గులాబీరంగు పురుగు ఆశించే ప్రమాదం ఉందని దీని నివారణకు ఎకరాకు 10 లింగాకర్షణ బుట్టలతో పాటు ప్రొఫెనోఫాస్ సైపర్‌ను పిచికారీ చేయాలన్నారు. సోయాబీన్ ప్రదర్శనా క్షేత్రాన్ని పరిశీలించి రైతులకు పలు సూచనలు సలహాలు అందజేశారు.

కేఎల్‌యూలో కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు చేయించుకుంటున్న కేఎల్‌యూ అధ్యాపకులు

తాడేపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో లారెన్స్, మైక్రో సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 270మంది విద్యార్థులు, అధ్యాపకులు, డ్రైవర్లు, సిబ్బంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి కాంటాక్ట్ లెన్స్ ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో వీసీ డాక్టర్ సారధివర్మ, ప్రోవీసీలు, డాక్టర్ వెంకట్రామ్, రాజశేఖరరావు, ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, అసోసియేట్ డీన్ డాక్టర్ రూత్‌రమ్య, హాబీ క్లబ్ ఇన్‌చార్జి డాక్టర్ శుభాకరరాజు, వైఆర్‌సీ ప్రొఫెసర్ ఇన్‌చార్జి డాక్టర్ ఆర్.సుప్రియ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యను పరిష్కరించాలని వినతి

మంగళగిరి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా గరవపాలెం గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు బుద్ధా శ్రీనివాసరావు తమ భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ తనకు వారసత్వంగా తాతల నాటి నుంచి ఉన్న 8 సెంట్ల భూమిని సొంత కుటుంబీకులే కబ్జాచేసి బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. 2006లో అప్పటి మంత్రి కే.రామకృష్ణకు సమస్యను విన్నవించగా, సర్వేయర్ ద్వారా కొలతలు వేయించి జిల్లా కలెక్టర్, సీఐ సమక్షంలో పత్రాలను అప్పగించారని తెలిపారు. ఇప్పుడు ఆ భూమిని కొందరు ఆక్రమించి దౌర్జన్యం చేస్తున్నారని, పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎలాంటి ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు సైతం భూ కబ్జాదారులతో కుమ్మక్కై దివ్యాంగుడినైన తనపై కనికరం లేకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



శ్రీగాయత్రీదేవి అలంకారంలో శ్రీమహంకాళీ అమ్మవారు

దుగ్గిరాల, సెప్టెంబరు 23: మండలంలోని కేఆర్‌కొండూరు శ్రీమహంకాళీ అమ్మవారు, దుగ్గిరాల శ్రీగంగాపార్వతీసమేత శ్రీనాగేశ్వరస్వామివారి ఆలయంలో అమ్మవారు రెండోరోజు మంగళవారం శ్రీగాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈమని, పేరుకలపూడి, శృంగారపురం, పెదకొండూరు, పెదపాలెం, చింతలపూడి, తుమ్మపూడి తదితర గ్రామాల్లోని శివాలయాల్లో అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. కేఆర్‌కొండూరు శ్రీమహంకాళీ అమ్మవారి ఆలయంలో శ్రీచండీహోమం కొనసాగించారు. ఈవో కోగంటి సునీల్‌కుమార్, ఫౌండర్ ట్రస్టీ దేవాభక్తుని రంగప్రసాద్ ఆలయ సిబ్బంది భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గజలక్ష్మీగా దర్శనమిచ్చిన అమ్మవారు

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళగిరి పట్టణంలోని పలు ఆలయాల్లో అమ్మవారు మంగళవారం గజలక్ష్మీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పాతమంగళగిరి దుర్గానగర్‌లో వేంచేసియున్న శ్రీ కనకదుర్గ అమ్మవారు, నృసింహాలయంలో కొలువైన శ్రీ రాజ్యలక్ష్మీ అమ్మవారు, ఘాట్‌రోడ్డు వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీ పద్మావతి అమ్మవారు, శివాలయంలో శ్రీ గంగా భ్రమరాంబికా అమ్మవారు గజలక్ష్మీ రూపంలో భక్తులను అనుగ్రహించారు. ఎర్రచెరువు వద్ద శ్రీ కాళీమాత అమ్మవారు గాయత్రీ దేవిగా, మంగళగిరి మెయిన్ బజారులోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారు కాత్యాయనీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.



● **కాకుమాను:** దేవి శరన్నవరాత్రులలో భాగంగా రెండో రోజు కొండపాటూరు స్వయంభు శ్రీపోలేరమ్మ అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం అప్పాపురంలో శ్రీభువనేశ్వరి దేవి ఆలయం, పోలేరమ్మ ఆలయం, మండల కేంద్రమైన కాకుమానులో గంగా పార్వతి సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయం, చెన్నకేశవ స్వామి ఆలయం, మండల పరిదలోని రేటూరులో అమరామృత లింగేశ్వర స్వామి, తదితర ఆలయాలలో కొలువై ఉన్న అమ్మవార్లు గాయత్రి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

● **పెదనందిపాడు:** స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం, సోమేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భజన సమాజాల వారు గీతాపారాయణం చేశారు.

● **వట్టిచెరుకూరు:** దసరా వేడుకల్లో భాగంగా రెండో రోజు ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాయత్రి పారాయణం నిర్వహించారు.

● **ఫిరంగిపురం:** మండలంలోని అమీనాబాద్ కొండపై శ్రీ మూలాం కురేశ్వరి దేవి అమ్మవారిని గాయత్రీ దేవిగా అలంకరించారు.

ధనలక్ష్మి అలంకరణ



తాడికొండ పడమర వీధిలో ధనలక్ష్మీ రూపంలో అమ్మవారు

తాడికొండ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): దసర పండుగ సందర్భంగా కనకదుర్గ అమ్మవారిని వివిధ రూపాలలో భక్తులు అలంకరించి భక్తులకు దర్శనార్థం ఉంచుతున్నారు. దేవీశరన్నవ రాత్రులు రెండవ రోజైన మంగళవారం తాడికొండ పడమర వీధిలో భవానీ ఆధ్యాత్మిక మండలి ఆధ్వర్యంలో అమ్మవారిని నగదుతో అలంకరించారు. మహిళలు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలను భక్తి శ్రద్దలతో నిర్వహించారు. తాడికొండ గ్రామంలోని పాత సినిమాహాల్ సెంటర్, చింతచెట్టు సెంటర్, పొన్నెకల్లు, కంతేరు, రావెల, బేజాత్‌పురం, ముక్కామల, దామరపల్లిగ్రామాల్లో భక్తి శ్రద్దలతో అమ్మవారికి భక్తులు పూజలు నిర్వహిస్తున్నారు. బడేపురం కొండపైన ఉన్న గంగాపార్వతి సమేత శ్రీ ఓంకారేశ్వరస్వామి ఆలయంలో గాయత్రిదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమించారు.

గాయిత్రి దేవీ అలంకారంలో

తుళ్లూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) భక్తి శ్రద్దలతో దేవీ నవరాత్రుల పూజలు జరుగుతున్నాయి. రాజధాని గ్రామాల్లో అమ్మవారి విగ్రమాలను నెలకొల్పి నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. రెండవ రోజు గాయిత్రి దేవీ అలంకారంలో దుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చారు.

ఆటో డ్రైవర్‌పై హత్యాయత్నం

● వైసీపీ నాయకుడి పాత్రపై ఫిర్యాదు ● విచారణ చేస్తున్న పోలీసులు

తాడికొండ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్‌పై మూడు సార్లు హత్యయత్నం జరిగిన సంఘటన తాడికొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం తాడికొండ శివారు బడేపురం గ్రామానికి చెందిన తాడిశెట్టి శ్రీనివాసరావు ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. గత నెలలో లారీతో ఆటోను గుద్దించి చంపటానికి ప్రయత్నం జరగగా తృటిలో శ్రీనివాసరావు తప్పించుకున్నాడు. ఇదే నెలలో ముగ్గురు వ్యక్తులు తాడికొండ నుంచి మోతడక త్రిపుల్ ఎక్స్ కంపెనీ వరకు ఆటో బాడుగ మాట్లాడుకొని బడేపురం మీదుగా వెళ్లే క్రమంలో శ్రీనివాసరావుకు ఇంజెక్షన్ చేయటానికి ప్రయత్నించారు. ఇది గమనించిన శ్రీనివాసరావు గట్టిగా కేకలు వేయగా వారు అక్కడ నుంచి పారిపోయారు. ఆదివారం రోజు మధ్యాహ్నం ఇద్దరు వ్యక్తులు ఆటో బాడుగకు మోతడక త్రిపుల్ ఎక్స్ కంపెనీ వద్దకు వెళ్లాలని చెప్పారు. అందులో ఒక వ్యక్తి ఇంజెక్షన్ చేయటానికి ప్రయత్నించాడు. గమనించిన ఆటో డ్రైవర్ వెంటనే ఆటోను నిలిపివేసి పెద్దగా కేకలు వేయగా ఒక వ్యక్తి పారిపోయాడు. మరో వ్యక్తిని పట్టుకొని తాడికొండ పోలీస్‌స్టేషన్ తీసుకువెళ్లి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఆ వ్యక్తిని విచారణ చేస్తున్నారు. హత్యయత్నంలో తన అన్న కుమార్తె భర్త పాత్ర ఉన్నట్లు ఆటోడ్రైవర్ ఫిర్యాదు చేశాడు. శ్రీనివాసరావుపై హత్యాయత్నం చేయబోయిన వ్యక్తి పోలీసులు విచారణలో ఓ వైసీపీ నాయకుడు తనకు డబ్బులు ఇచ్చి హత్యచేయమని చెప్పినట్లు సమాచారం. పోలీసులు కేసును నీరుగార్చేందుకు యత్నిస్తున్నట్లు గ్రామంలో చర్చ జరుగుతోంది.

మ్యాజిక్ డ్రెయిన్లతో మురుగుమాయం

● ఎన్‌ఆర్‌ఈజీఎస్ డైరెక్టర్ షణ్ముఖ



బొర్రావారిపాలెంలో మ్యాజిక్ డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ డైరెక్టర్ షణ్ముఖ

ప్రత్తిపాడు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో మ్యాజిక్ డ్రైన్‌ల నిర్మాణంతో మురుగును పూర్తిగా మాయం చేయవచ్చునని ఎన్‌ఆర్‌ఈజీఎస్ డైరెక్టర్ షణ్ముఖ తెలిపారు. మండల పరిధిలోని బొర్రావారిపాలెంలో పైలెట్ ప్రాజెక్టుగా మ్యాజిక్ డ్రైన్ నిర్మాణం జరుగనుంది. ఈ నిర్మాణానికి సంబంధించి ఆరు జిల్లాల ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మ్యాజిక్ డ్రెయిన్ల వలన కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. తక్కువ ఖర్చుతో ఈ డ్రెయిన్ల నిర్మాణం జరుగుతుందన్నారు. సీసీ డ్రెయిన్ల నిర్మాణం వలన మురుగు నిల్వ ఉండటంతో దోమల బెడద ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ నిర్మాణం వలన మురుగు ఎక్కడా నిల్వ ఉండే అవకాశమే ఉండదన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ అడిషనల్ కమిషనర్ శివప్రసాద్, జాయింట్ కమిషనర్ సునీత, చీఫ్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ గోపిచంద్, గుంటూరు జిల్లా పీడీ వి శంకర్, గ్రామ సర్పంచ్ మాకినేని జన్, ఎంపీడీవో శివపార్వతి, ఏపీడీ శ్యామలాదేవి, ఏపీవో ఎస్.ఏడుకొండలు, రాజశేఖర్, ఆరు జిల్లాలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

పీ-4పై సచివాలయ సిబ్బందికి అవగాహన

తుళ్లూరు సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పీ-4పై తుళ్లూరు మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బంగారు కుటుంబం, మార్గదర్శుల వివరాలను ఈ నెల 25లోపు జీఎస్‌డబ్ల్యూఎస్ యాప్‌లో అప్‌లోడు చేయాలని నియోజకవర్గ పీ-4 టీం సభ్యులు అనురూప్ శ్రీప్రియ (యంగ్ ప్రొఫెషనల్) ఆయేషియబేగం వీఎస్-5 (డబ్ల్యూపీఆర్ఎస్), షేక్ నాగుల్ మౌలాలీ వీఎస్-3 (డబ్ల్యూపీఆర్ఎస్) సూచించారు. మార్గదర్శుల వివరాలు స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాలన్నారు. పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పీ-4 విధానం ప్రభుత్వం తరుపు నుంచి జరుగుతుందన్నారు.

పొలాలు మునగకుండా శాశ్వత పరిష్కారం చూడాలి

తాడేపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలు, భారీ వర్షాలు కురవడంతో తాడేపల్లి మండలంలోని కుంచనపల్లి, గుండిమెడ వడ్డేశ్వరం కొలనుకొండ గ్రామాల పరిధిలోని రైతుల పంటపొలాలు మునిగిపోకుండా శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలని, మురుగుసమస్య పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలురైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎంటీఎంసి పరిధిలోని కొలనుకొండ, వడ్డేశ్వరం, గుండిమెడవైపు వెళ్లు కట్ట రోడ్డు వద్ద రైతు సంఘం నేతలు మునిగిన పంటపొలాలను రైతులు గండికొట్టిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి కాజ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చిన్నపాటి వర్షం కురిసినా ప్రతిసారి తాడేపల్లి మండలంలో పంటపొలాలు నీటమునిగే పరిస్థితి దాపురించిందన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు పల్లె కృష్ణ, అమ్మిశెట్టి రంగారావు, కానుగోలు కోటయ్య, నాగపోగు విజయరాజు, కొమ్మారెడ్డి వెంకటేశ్వరరావుపాల్గొన్నారు.

మహిళల ఆరోగ్య పరిరక్షణకు స్వస్థ్ నారీ సశక్త్ పరివార్



సదస్సులో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివన్నారాయణ

మంగళగిరి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ పథకాన్ని అమలు చేస్తుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిట్రా శివన్నారాయణ చెప్పారు. మంగళగిరి లక్ష్మీనరసింహస్వామి కాలనీలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. మహిళలు, బాలికలకు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మునగాల నాగేశ్వరరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పడవల మహేష్, నేతలు తుల్లిమిల్లి రామకృష్ణ, జగ్గారపు శ్రీనివాసరావు, కారంపూడి అంకమ్మరావు, అందె శివశంకరరావు, పందేటి సాంబశివరావు, పడమట రాధాకృష్ణ, వాకా మాధవగౌడ్, కమల కృష్ణ, పోలిశెట్టి సోమశేఖర్, వైద్యులు కేవీఎస్ శ్రీనివాస్, కీర్తి, రామారావు, ప్రతాపరెడ్డి, కౌశిక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా



మాట్లాడుతున్న ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా

మంగళగిరి సిటీ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వర్షాలు విస్తారంగా కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా సూచించారు. ఎంటీఎంసీ సమావేశ మందిరంలో మంగళవారం సీజనల్ వ్యాధుల నివారణపై మెప్మా సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కమిషనర్ అలీం బాషా మాట్లాడుతూ నిల్వ వున్న ఆహార పదార్థాలు, జంక్ ఫుడ్ తీసుకోవద్దని, కాచి చల్లార్చిన నీటిని వడగట్టిన తర్వాత మాత్రమే తాగాలని, ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అడిషనల్ కమిషనర్ కే.శకుంతల మాట్లాడుతూ సీజనల్ వ్యాధులకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ సమావేశంలో ఎంటీఎంసీ అసిస్టెంట్ కమిషనర్ పట్లూరి శ్రీనివాసరావు, మెప్మా అధికారులు, ఆర్పీలు పాల్గొన్నారు.

సాంకేతిక ఆవిష్కరణల ప్రాముఖ్యం పెరుగుతోంది

కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ బాబు

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక ఆవిష్కరణల ప్రాముఖ్యం పెరుగుతోందని, ప్రస్తుతం నిర్వహిస్తున్న హ్యాక్‌థాన్‌లు ఉద్యోగ అవకాశాలను కల్పించటంలో ప్రముఖ పాత్ర పోషిస్తాయని కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ బాబు అన్నారు. మండలంలోని వింజనంపాడు సమీపంలోని కిట్స్ కళాశాలలో సీఎస్‌ఈ విభాగం ఆధ్వర్యంలో 4వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మిషన్ లెర్నింగ్ అండ్ ఏ-1లో నిర్వహించిన రెండు రోజుల హ్యాక్‌థాన్ మంగళవారం ముగిసింది. కార్యక్రమంలో మొత్తం 48 టీమ్‌లు పాల్గొని వివిధ రంగాలకు చెందిన వినూత్నమైన ఆవిష్కరణలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలను జ్యూరీ ప్రతినిధులు ఎస్‌ఏ రాజేష్, ఎం పవన్ విజయ కుమార్, భాను ప్రకాష్, శివ బోయపాటి ప్రత్యేకంగా తిలకించారు. ఈ కార్యక్రమాన్ని సీఎస్‌ఈ విభాగాతిపతి ప్రొఫెసర్ ఆర్ రమేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

అప్పులు ఇచ్చి జైలుకు వెళ్లాలా?

దుకాణం వద్ద ఫర్టిలైజర్స్ షాపు యజమాని వినూత్న నిరసన

ప్రత్తిపాడు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తనకు అప్పులు ఇచ్చిన వారు వెంట బడుతుండటం.. తాను అప్పులు ఇచ్చిన వారు ముఖం చాటేస్తుండటంతో ప్రత్తిపాడులోని వేణుమిత్ర ఫర్టిలైజర్స్ పర్టిలైజర్స్ యజమాని గొట్టం పరమేశ్వరరావు మంగళవారం వినూత్నంగా నిరసన చేపట్టారు. తాను అప్పులు ఇచ్చిన రైతులు వచ్చి తనకు బాకీలు చెల్లించే వరకు దీక్ష చేస్తానని ఆయన తెలిపారు. రూ.52 లక్షలను రైతులు తన వద్ద అప్పు తీసుకున్నారని అయితే వారు బాకీలు చెల్లించడంలేదన్నారు. అదే సమయంలో తనకు రూ.35 లక్షల అప్పులతో పాటు పురుగుమందుల కంపెనీలకు రూ.25 లక్షలు బాకీ ఉండగా వారు తనపై ఒత్తిడి చేస్తున్నారని వాపోయారు. రైతులకు అప్పులు ఇచ్చి తాను జైలుకు వెళ్లాలా.. ఇబ్బందులు పడాలా అంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

తాడికొండలో డీపీవో పర్యటన



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీపీవో నాగ సాయి కుమార్

తాడికొండ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) తాడికొండ గ్రామంలో మంగళవారం పర్యటించారు. గ్రామంలో జరిగే పారిశుద్య పనులను పరిశీలించారు. కంతేరురోడ్డు, పరిమి రోడ్డు, నిడమర్రురోడ్డు, పాతసినిమాహల్ సెంటర్, జయభారత్ కాలనీల్లో పర్యటించి పారిశుద్య నిర్వహణపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు వీధులను శుభ్రంగా ఉంచాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రమణయ్య మాట్లాడుతూ ప్రతి రోజు ప్రధాన రహదారులు వెంట ఉన్న చెత్త చెదారాన్ని క్లీన్ చేస్తున్నామని తెలిపారు. పారిశుద్య కార్మికులు 20 మంది మాత్రమే ఉన్నారని వారికి జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నామని డీపీవోకి తెలియజేశారు.

వరి, పత్తి పంటలో నీటిని తొలగించాలి

● ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ మనోజ్



నీటిలో మునిగిన వరి పైరును పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు ఏవో సునీత

వట్టిచెరుకూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వరి, పత్తి పైరులో నిలిచిన నీటిని బయటకు పంపాలని ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఏ మనోజ్ రైతులకు సూచించారు. మంగళవారం వట్టిచెరుకూరు, కొర్నెపాడులో నీట మునిగి కునారిల్లుతున్న పత్తి పైరును ప్రధాన శాస్త్రవేత్త కీటక విభాగం సాంబశివరావు, అమర జ్యోతి, ప్రధాన శాస్త్రవేత్త కలుపు విభాగం ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఏ మనోజ్‌లతో కలసి మండల వ్యవసాయ అధికారి సీహెచ్ సునీత, వీఏఏ సుభానీ రైతులతో కలసి పరిశీలించాలరు. తొలి దశగా తేమను తట్టుకునేందుకు 19-19-19 స్ప్రే చేయటం ద్వారా ఆయా పంటలను కొంతమేర కాపాడుకోవచ్చని రైతులకు సూచించారు.

రోగి భద్రతను కాపాడాలి : విలియం క్యారీ



వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులతో వైవీ అంజనేయులు, డాక్టర్ విలియం క్యారీ

తాడికొండ(లాం)సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రోగి భద్రను కాపాడటమే ఫార్మసిస్టు బాధ్యత అని ఏపీ ఫార్మసీ ఇండియా కౌన్సిల్ ఆఫ్ ఇండియా రిజిస్ట్రార్ డాక్టర్ విలియం క్యారీ పేర్కొన్నారు. లాం చలపతి ఫార్మసీ కళాశాలలో 5వ జాతీయ ఫార్మాకోవిజిలెన్స్-2025 కార్యక్రమంలో ఈనెల 17వ తేదీ నుంచి 23 వరకు జరిగింది. లాం చలపతి ఫార్మసీ కళాశాల, ఇండియన్ ఫార్మాకోపియా కమిషన్, ఫార్మాకోవిజిలెన్స్ ప్రోగ్రాం ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జాతీయ ఫార్మాకెవిజిలెన్స్ కార్యక్రమాన్ని చేపట్టారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన విలియం క్యారీ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫార్మాసిస్టులు ఏడీఆర్ రిపోర్టింగ్‌లో కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. రోగులకు సురక్షితమైన ఔషదాల వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. ఫార్మకు సంబంధించి విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు బహూకరించారు. కార్యక్రమంలో చలపతి విద్యా సంస్థల చైర్మన్ వై.వీ.ఆంజనేయులు, ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు, డాక్టర వంశీకృష్ణ వసభక్తుల, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

యూరియాపై ఆందోళన వద్దు: ఏవో సుధాకర్

కాకుమాను, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని, వరి సాగు చేసే రైతులు యూరియా గురించి ఆందోళన చెందవద్దని మండల వ్యవసాయశాఖ అధికారి సుధాకర్ అన్నారు. మండల పరిధిలోని వల్లూరు, చిన్నలింగాయపాలెం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన ఏవో సుధాకర్ అనంతరం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరు వరకు మాత్రమే పంటల నమోదుకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి : తహసీల్దార్

కాకుమాను, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలోని ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వెంకటస్వామి అన్నారు. మండల పరిధిలోని పాండ్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలో సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కాకుమాను, పాండ్రపాడు వైద్యులు డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ శ్రీధర్‌లు మాట్లాడుతూ కాచిచల్లార్చిన నీరు తాగాలని, భోజనానికి ముందు, తరువాత, కాలకృత్యాల అనంతరం చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ హేమలత, సిబ్బంది పాల్గొన్నారు